న్యాయ సహాయ సేవలందించడమే లక్ష్యం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: న్యాయ సహాయ సేవలందించడమే న్యాయ సేవాధికార సంస్థ ఉద్దేశమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి అన్నారు. శనివారం ఆయన కోడుమూరు ఐసీడీఎస్ కార్యాలయంలో విధాన్‌సే సమాధాన్ మహిళ న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో న్యాయం ఎవరికి అవసరమో గుర్తించి ఉమ్మడి జిల్లాలో 59 బ్లాకులను హైకోర్టు ఎంపిక చేసిందన్నారు. బ్లాకుకు 60 మంది చొప్పున ఉంటారన్నారు. తమతోపాటు అంగన్‌వాడీ, ఐసీడీఎస్, డ్వాక్రా, చైల్డ్ డెవలప్‌మెంట్ బాధ్యత తీసుకుంటాయన్నారు. నేరమనేది తెలిసి చేసినా, తెలియక చేసినా చట్టం నుంచి తప్పించుకునేందుకు వీల్లేదన్నారు. మనిషి పుట్టుక, మరణం మొత్తం చట్టంతోనే ముడిపడి ఉంటుందన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు హేమలత, దివ్యాంగుల సంక్షేమ శాఖ పర్యవేక్షకులు సాలెమన్ రాజు, ఐసీడీఎస్ సీడీపీవో వరలక్ష్మి, పర్యవేక్షకులు సుజాత, మల్లేశ్వరమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్‌యూకు దసరా సెలవులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాయలసీమ విశ్వవిద్యాలయానికి ఆదివారం నుంచి ఈ నెల 13 వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు ఇన్‌ఛార్జి వీసీ ఎన్‌టీకే నాయక్ శనివారం తెలిపారు. ఈ నెల 14న తరగతులు పునః ప్రారంభం కానున్నాయని చెప్పారు.

టెట్‌కు 1,097 మంది హాజరు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: జిల్లాలో శనివారం జరిగిన టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష)కు మూడో రోజు 1,265 మంది అభ్యర్థులకుగాను.. 1,097 మంది హాజరైనట్లు డీఈవో శామ్యూల్ శనివారం తెలిపారు.

వన్యప్రాణుల ప్రేమాలయం

❖ సమస్త జీవుల సమాహారం నల్లమల

- ఆత్మకూరు, న్యూస్‌టుడే :

నల్లమల.. వన్యప్రాణుల కోవెల.. సమస్త ప్రాణుల సమాహారం.. జీవ వైవిధ్యానికి నిలయం.. పచ్చదనంతో కళకళలాడే ఈ అరణ్యం అరుదైన వృక్ష, గడ్డి జాతులకు ఆలవాలం. పెద్ద పులులకు అనువైన ఆవాస ప్రాంతంగా ప్రపంచ ఖ్యాతిగాంచింది. ఇక్కడ చేపట్టిన సంరక్షణ కార్యక్రమాలతో ఏటా వ్యాఘ్రాలు, చిరుతల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

అరుదైన, అంతరించిపోతున్న జంతు, పక్షి జాతులూ ఇక్కడ సందడి చేస్తుండటంతో నల్లమల ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ అభయారణ్యంలోని జీవ, వృక్ష జాతులు.. వాటి సంరక్షణకు చేపడుతున్న చర్యలు.. ప్రజల భాగస్వామ్యంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా అక్టోబరు మొదటి వారంలో అటవీ అధికారులు వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. దసరా సెలవుల్లో విద్యార్థులు జీవ వైవిధ్యంపై అవగాహన పెంపొందించుకునేందుకు ఇదే చక్కని అవకాశం. ఇక పదండి నల్లమలను చుట్టేద్దాం.!!



కూనలతో పెద్దపులి





బ్యాంబో పిట్ వైపర్, గ్రీన్ స్నేక్



బెట్టు ఉడుత



ప్యారడైజ్‌డ్ ఫ్లై క్యాచర్, అందమైన పక్షి



ఛేంజబుల్ హాక్ ఈగల్



షార్ట్ ఇయర్డ్ ఓవెల్

❖ కొనసాగుతున్న సంరక్షణ వారోత్సవాలు

❖ పిల్లలూ సెలవుల్లో చూసేద్దాం

ఎకలాజికల్ నాలెడ్జ్ పార్క్

సున్నిపెంట జీవ వైవిధ్య కేంద్రం ఎదురుగా ఎనిమిది హెక్టార్లలో ఎకలాజికల్ నాలెడ్జ్ పార్క్ ఏర్పాటు చేశారు. భూమి పుట్టుక, జీవ పరిణామ క్రమం, కాలక్రమేణా సంభవించిన మార్పులపై అవగాహన కల్పించే చిత్రాలు, బొమ్మలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. వీటి సందర్శనకు వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం నాలుగు ప్రాంతాల్లో భోజనం, విడిది, మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటు చేశారు.

అరణ్యంపై అవగాహన

నల్లమల అభయారణ్యంలో పెద్దపులులు, చిరుతలు, కణితి, మనుబోతులు, చుక్కల దుప్పులు, నాలుగు కొమ్ముల జింకలు, కృష్ణ జింకలు, పెద్దనక్కలు, రేసుకుక్కలు, హైనా, ఎలుగుబంట్లు, అడవి పిల్లులు, అడవి పందులు, ఊసరవెల్లులు, నెమళ్లు, అరుదైన పక్షులు, రంగురంగుల సీతాకోక చిలుకలు ఉన్నాయి. వీటితో పాటు 300-400 రకాల పక్షులు, 75 రకాల సరీసృపాలు, 80 రకాల క్షీరద జాతులు, వేలాదిగా క్రిమి కీటకాలు, ఆకోరేరుకలు, 600 లకు పైగా వృక్ష జాతులు ఉన్నాయి. ఈ అభయారణ్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నారు. బైర్లూటి, పచ్చర్ల ఎకో టూరిజం ప్రాంతాలకు వచ్చే పర్యాటకులకు మినీ డాక్యుమెంటరీ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

ఆవాసం.. ఆహార కల్పన చర్యలు

నల్లమలలో పులుల సంతతి క్రమేణా పెరుగుతోంది. ప్రస్తుతం నల్లమలలో పులుల సంతతి 85కు చేరినట్లు గుర్తించారు. పులికూనలు తారసపడుతుండటంతో వీటి సంఖ్య భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 32 హెక్టార్లలో పచ్చిక మైదానాలు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వేట సమయంలో పులులకు హాని కలగకుండా గడ్డి మైదానాల్లో ఉన్న ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు తొలగించనున్నారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు నివారించేందుకు గడ్డి మైదానాల చుట్టూ ఫైర్‌లైన్లు ఏర్పాటు చేయనున్నారు. నీటి కుంటలు, చెక్‌డ్యాంలు ఏర్పాటు, సోలార్ విద్యుత్తుతో పనిచేసే బోర్ల ద్వారా నీటి సౌకర్యం కల్పించే పనులు చేపడుతున్నారు.

భావితరాలకు నిక్షిప్తం

కాలగమనంలో ఎన్నో జీవజాతులు అంతరించి పోతున్నాయి. వీటి గురించి భవిష్యత్తు తరాలకు తెలియజేయాలన్న ఉద్దేశంతో 2001 డిసెంబరు 8న శ్రీశైలంలో జీవవైవిధ్య పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నల్లమలలోని వైవిధ్యమైన ప్రాణులను ప్రపంచానికి పరిచయం చేసేలా ఇక్కడ అనేక జీవరాశులను నిక్షిప్తం చేశారు. నల్లమలలో నివసించే జంతువులు, వాటి జీవన విధానాలు, కొత్త జీవరాశులను గుర్తించడం, వాటిని ప్రపంచానికి పరిచయం చేయటం వంటి పనులు ఈ కేంద్రం ద్వారా కొనసాగుతున్నాయి. ఇందులో 303 రకాల కీటకాలు, 80 రకాల పాములు, 102 రకాల సీతాకోక చిలుకలు, 55 రకాల చేపలు, 25 లాంబాలు, 18 కప్పలు, 54 రకాల సరీసృపాలు, 57 రకాల మాత్‌లు, 77 రకాల కీటకాలను భద్రపరిచారు.

ఆదివారం ప్రత్యేకం

నాన్న మార్చిన రాత



■ పట్టువీడని భరద్వాజ్
■ ఆదోని సబ్ కలెక్టర్ విజయగాథ

ఆటంకాలు ఎదురైనా.. వెనకడుగు వేయలేదు..!
లక్ష్య సాధనలో విఫలమైనా.. నిరుత్సాహపడలేదు!
అపజయాలు భయపెడుతున్నా.. ధైర్యంతో సమాధానం చెప్పారు..!
తోటివారు దాటిపోతున్నా.. సహనంతో ఎదురుచూశారు..!
లోపాలు అడ్డుపడుతున్నా.. అనుకూలంగా మలుచుకున్నారు..!
అనుకూల ఫలితాలు రాకపోయినా.. ప్రయత్నాలు విరమించలేదు..!
పట్టువీడక ఐఏఎస్ సాధించారు.. కొలువుతో లక్ష్యం చేరుకున్నారు.!

వేలు పట్టి నడిపించిన నాన్నే తన 'రాత' మార్చారని చెబుతున్నారు ఆదోని సబ్ కలెక్టర్ మంత్రి మౌర్య భరద్వాజ్.

అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన సత్యప్రసాద్, రాధాకుమారి దంపతుల కుమారుడు మంత్రి మౌర్య భరద్వాజ్. తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, తల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఫార్మసిస్టుగా సేవలందిస్తున్నారు. భరద్వాజ్ భార్య కిరణ్మయి వైద్యురాలిగా పని చేస్తున్నారు. భరద్వాజ్‌ది చిన్నప్పటి నుంచీ కష్టపడే మనస్తత్వం. ప్రతి పరీక్షలో ఉత్తమ మార్కులు సాధిస్తూ ప్రశంసలు అందుకునేవారు. నర్సీపట్నంలో పదో తరగతి, వైజాగ్‌లో ఇంటర్, వరంగల్ ఎన్ఐటీ కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు. సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం సాధించారు.

– న్యూస్‌టుడే, ఆదోని గ్రామీణం, ఆదోని ఎస్కేడి కాలనీ

దృష్టంతా ఐఏఎస్‌పైనే

మౌర్య భరద్వాజ్ బీటెక్ పూర్తి చేసిన తర్వాత హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా కొలువు సాధించారు. ఆశించినంతగా తృప్తినివ్వలేదు. ప్రజలకు దగ్గరుండి సేవ చేయాలనే ఆలోచన మనసులో బలంగా నాటుకుంది. దీంతో ఐటీ ఉద్యోగం వదిలిపెట్టి తన అడుగులు ఐఏఎస్ వైపు వేశారు. దిల్లీ నగరానికి వెళ్లి అక్కడ సివిల్స్‌లో శిక్షణ తీసుకున్నారు. ఆ తర్వాత సివిల్స్ మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణత సాధించినా.. ర్యాంకు రాబట్టలేకపోయారు.

నైపుణ్యం పెరిగేలా సాధన

తన లోపాలు తెలుసుకున్నారు. సివిల్స్‌లో రాత నైపుణ్యం (రైటింగ్ స్కిల్స్)లో చాలా వెనుకబడినట్లు గుర్తించి, మెరుగుపరుచుకోవాలని నిర్ణయించుకున్నారు. తండ్రి సత్యప్రసాద్ దగ్గరుండి రోజూ రాత నైపుణ్యంపై సాధన చేయించారు. అలా తన రాతను మెరుగుపరుచుకున్నారు భరద్వాజ్. రెండు, మూడు ప్రయత్నాల్లో విజయం సాధించలేకపోయారు. మళ్లీ సాఫ్ట్‌వేర్ కొలువులో చేరారు. అయినా ఏదో తెలియని ఆందోళన వెంటాడుతూనే ఉంది. ఎలాగైనా సరే సివిల్స్ సాధించాలనే పట్టుదల మాత్రం వీడలేదు. ఓ వైపు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా రాణిస్తూనే మరోవైపు సివిల్స్ రాసేందుకు సాధన చేశారు. నాలుగోసారి కూడా అపజయం తప్పలేదు. అయినా నిరుత్సాహాన్ని దరిచేరనీయలేదు. ఐదోసారి సివిల్స్‌లో ఏకంగా 28వ ర్యాంకు సాధించి అందరితో ప్రశంసలు అందుకున్నారు. 2022వ బ్యాచ్‌కు చెందిన ఈయన ఏడాదిపాటు ముస్సోరీలో శిక్షణ తీసుకున్నారు. ఆ తర్వాత కడపలో శిక్షణ సహాయ కలెక్టర్‌గా పని చేశారు. అనంతరం మొదటి పోస్టింగ్ కింద ఆదోని సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.

వైఫల్యాలను మనమే భయపెట్టాలి : మంత్రి మౌర్య భరద్వాజ్, సబ్ కలెక్టర్, ఆదోని

లక్ష్య సాధనలో ఎదురయ్యే వైఫల్యాలను చూసి మనం భయపడకూడదు.. మన పట్టుదలను చూసి అవే భయపడాలి. మనసు చెప్పిందే వినాలి. ఎంచుకునే దారి ప్రజలకు మేలు చేసేదై ఉండాలి. అపజయాలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా లోపాలు తెలుసుకోవాలి. వాటిని అధిగమించి అనుకున్న లక్ష్యం సాధించాలి. అమ్మానాన్న నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. నిరుత్సాహం దరిచేరకుండా కొండంత ధైర్యాన్నిచ్చారు. ఐఏఎస్ కావాలనే కల నెరవేరింది. ప్రజలకు మేలు చేసే బాధ్యత నాముందుంది. జిల్లాలో పశ్చిమ ప్రాంతం వెనుకబడుంది. వలసలు, నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి చేస్తా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలకనుగుణంగా పేదల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పని చేస్తా.

పారిశ్రామికవాడకు పట్టాలు

■ కొత్త రైల్వే లైన్‌కు ప్రతిపాదన
■ రెండు జిల్లా కేంద్రాల అనుసంధానం



ఈనాడు, కర్నూలు: ఓర్వకల్లు పారిశ్రామికవాడ అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక చొరవ తీసుకొంది.. అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు సరకు రవాణా చేయడానికి వీలుగా కర్నూలు నుంచి నంద్యాల వరకు ఓర్వకల్లు మీదుగా కొత్త రైలు మార్గం ప్రతిపాదనకు ఆ శాఖ అధికారులు సానుకూలత వ్యక్తం చేశారు. కల్లూరు మండలం దూపాడు నుంచి నన్నూరు, ఓర్వకల్లు, సోమయాజులపల్లె, హుస్సేనాపురం, కాల్వబుగ్గ మీదుగా సిమెంట్ నగర్ వరకు కొత్త రైల్వేలైన్ నిర్మించే అవకాశం ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించిన రైల్వే అంశాలపై విజయవాడలో దక్షిణమధ్య రైల్వే జీఎం సమీక్షించారు.

● గతంలో కర్నూలు నుంచి మచిలీపట్నం వరకు నడిచిన రైలుసర్వీసు స్థానంలో కర్నూలు నుంచి విశాఖ వరకు నడిచేలా సర్వీసు ఉంటే బాగుంటుందని చర్చించారు.. దీని ద్వారా రాయలసీమ, దక్షిణ కోస్తా, ఉత్తర కోస్తాలోని పలు ప్రాంతాలు అనుసంధానమవుతాయని ఎంపీ బస్తిపాటి నాగరాజు రైల్వే అధికారులకు తెలిపారు.

● కర్నూలు నుంచి మంత్రాలయం వరకు కొత్త రైల్వేలైను ఏర్పాటు చేయాలి దీని ద్వారా మంత్రాలయం వెళ్లే భక్తులకు అనుకూలంగా ఉండటంతో పాటు కర్నూలు నుంచి ముంబయికి వెళ్లడానికీ ప్రయోజనకరమని ఎంపీ ప్రస్తావించారు. ఎమ్మిగనూరు, ఆదోని పరిసర ప్రాంతాల వాసులు ముంబయికి రాకపోకలు సాగిస్తుండటంతో ఎంతో ప్రయోజనమని భావిస్తున్నారు.

● కర్నూలు-మంత్రాలయానికి కొత్త రైల్వే మార్గం ఏర్పాటు భారీ వ్యయంతో కూడుకున్నది కావడంతో సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కోసిగి, మద్దికెర, తుగ్గలి స్టేషన్లలో గతంలో కొన్ని రైళ్లను ఆపేవారని, కొవిడ్ అనంతరం ఆయా స్టేషన్లలో కొన్నింటిని నిలపకపోవడంతో ఆయా ప్రాంతాల వాసుల ఇబ్బందులపైనా చర్చించారు.

● కర్నూలు శివారు పంచలింగాలలో 'కోచ్ మిడ్‌లైఫ్ రీహాబిలిటేషన్ వర్క్‌షాప్' నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్న విషయాన్ని ఎంపీ నాగరాజు జీఎం దృష్టికి తీసుకెళ్లగా... వచ్చే ఏడాది నాటికి ఆ ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.



గ్రామోత్సవానికి తరలివస్తున్న స్వామి అమ్మవారు



కొలువుదీరిన స్వామి అమ్మవారు

రావణ వాహనంపై త్రినేత్రుడి విహారం

శ్రీశైలంలో నేడు

నాలుగో రోజు ఆదివారం రాత్రి 7 గంటలకు భ్రమరాంబాదేవి భక్తులకు కూష్మాండదుర్గ అలంకారంలో దర్శనమివ్వనున్నారు. శ్రీస్వామిఅమ్మవార్లకు కైలాస వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు.

అష్టాదశశక్తిపీఠం శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు సందడిగా కొనసాగుతున్నాయి. మూడో రోజైన శనివారం భ్రమరాంబాదేవి చంద్రఘంట అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సర్వాంగ సుందరంగా ముస్తాబైన వేదికపై చంద్రఘంటాదేవి చంద్రవంకను శిరస్సున ఆభరణంగా ధరించి, యుద్ధోన్ముఖురాలి రూపంలో భక్తులకు సాక్షాత్కరించారు. సుగుణాలను ప్రసాదించే దుర్గమ్మగా పేరుగాంచిన చంద్రఘంటాదేవిని ఆలయ అర్చకులు సుగంధ, పసుపు, కుంకుమలతో అర్చనలు చేసి మంగళహారతులు సమర్పించారు. స్వామిఅమ్మవార్లు రావణ వాహనాధీశులై పూజలందుకున్నారు. ఆలయ ప్రధాన పురవీధుల్లో స్వామిఅమ్మవార్లకు శోభాయమానంగా గ్రామోత్సవం జరిగింది. ఆలయ దక్షిణ మాడవీధిలో కేరళా నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే :



ఆర్.గుంతలపాడు

కర్నూలు-సుంకేసుల ప్రధాన రహదారిలో ఆర్.కొంతలపాడు వద్ద రహదారి అధ్వానంగా మారింది. అడుగడుగునా గుంతలు ఉన్నాయి. ఫలితంగా వాహనదారులు పట్టుతప్పి కిందపడి గాయపడుతున్నారు. మోకాలిలోతు గుంతలు ఉండటంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఏళ్ల తరబడి రహదారికి మరమ్మతులు చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి పాలకులు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. – ఈనాడు, కర్నూలు

ప్రతాప్‌రెడ్డి నియామకం నిలిపివేత

ఈనాడు, కర్నూలు : కర్నూలు జిల్లా డీఆర్‌డీఏ పీడీగా పోస్టింగు పొందిన ప్రతాప్‌రెడ్డి నియామకం ఆగిపోయింది. ఆ స్థానంలో వేరొకరిని నియమించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతాప్‌రెడ్డిని డీఆర్‌డీఏ పీడీగా నియమిస్తూ జీవో విడుదలైన తర్వాత ఆయనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి బుగ్గన వద్ద సహాయ వ్యక్తిగత కార్యదర్శిగా విధులు నిర్వర్తించిన విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. కొందరు తెదేపా నేతలపై కేసులు పెట్టడంలో ఆయన కీలకపాత్ర పోషించారని పలువురు ఆరోపించారు. మరికొందరు తెదేపా నేతలు ఆయన నియామక విషయమై మంత్రులు లోకేశ్, కొండపల్లి శ్రీనివాస్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయనకు పోస్టింగ్ ఆర్డర్ ఇవ్వకుండా ఆపేశారు. మెప్మా పీడీ నాగశివలీలకు ఉన్నతాధికారులు శుక్రవారం ఫోన్ చేసి వెంటనే ఇన్‌ఛార్జి బాధ్యతలు స్వీకరించాలని సూచించారు. ఆమె శనివారం కలెక్టర్‌ను కలిసి బాధ్యతలు స్వీకరించిన విషయాన్ని వివరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా, పక్కన విశ్రాంత ఐఏఎస్ అధికారి రామ్‌శంకర్ నాయక్

ఏటా 15 శాతం వృద్ధిరేటు సాధనే లక్ష్యం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో ఏటా 15 శాతం వృద్ధిరేటు సాధనే లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళికను రూపొందిస్తున్నామని.. వివిధ వర్గాల ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించి ప్రభుత్వానికి పంపుతామని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో వివిధ వర్గాల ప్రజల నుంచి శనివారం సూచనలు, సలహాలు స్వీకరించారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళికలో భాగంగా ప్రధానంగా వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో అభివృద్ధిపై దృష్టి సారించామన్నారు. 2022-23లో కర్నూలు జిల్లా జీడీపీ రూ.47,514 కోట్లతో రాష్ట్రంలో 14వ స్థానంలో ఉందని తెలిపారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి రామ్‌శంకర్ నాయక్, విశ్రాంత ఐపీఎస్ అధికారి, మాజీ ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, ఆర్‌యూ, ట్రిపుల్ ఐటీ కళాశాల ప్రొఫెసర్లు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, రైతు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, సీపీవో హిమప్రభాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.


సెలవికా

■ ఆడుకుంటూ అనంతలోకాలకు
■ వేర్వేరు ఘటనల్లో నలుగురు చిన్నారుల మృతి

దసరా సెలవులొచ్చాయి.. అల్లరి చేశారు.. ఆటలు ఆడారు.. నవ్వులతో మురిపించారు.. సెలవుల్లో సరదాగా గడుపుతున్న నలుగురు చిన్నారులను మృత్యువు కబళించింది.. బహిర్భూమికి వెళ్లిన ముగ్గురు చిన్నారులు ఆడుకుంటూ నీటికుంటలో మునిగిపోయారు.. సీసాలో ఉన్న ద్రావణం తాగేదని పురుగు మందు తాగిన ఇద్దరు చిన్నారుల్లో ఒకరు మృతి చెందగా, మరొకరు చికిత్స పొందుతున్నారు. రెండు గ్రామాల్లో శనివారం జరిగిన ఈ ఘటనలు తీవ్ర విషాదం నింపాయి.

ద్రావణమని పురుగుల మందు తాగి...

ఎమ్మిగనూరు మండలం కె.నాగలాపురానికి చెందిన బాలురు మహిరాం, హరికృష్ణ ఒకే వీధిలో ఉంటున్నారు. శనివారం ఆడుకుంటున్నారు. పంటలకు పిచికారీ చేసేందుకు తెచ్చిన పురుగు మందు డబ్బాను ఇంట్లోంచి బయటకు తెచ్చారు. తాగే ద్రావణమని భావించి మూత తీసి ఇద్దరూ తాగారు. అస్వస్థతకు గురవడంతో గమనించిన బంధువులు చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మహిరాం (5) మృతి చెందగా, హరికృష్ణ పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తీసుకెళ్లారు. మహిరాం తండ్రి కాశీం గతంలోనే చనిపోగా తల్లి జయలక్ష్మి కూలీ పనులు చేస్తూ పోషిస్తోంది. హరికృష్ణ తండ్రి మహేశ్ బతుకుదెరువుకు హైదరాబాద్ వెళ్లారు.




-ఎమ్మిగనూరు గ్రామీణం, నందవరం

కన్నీ రొలికిన కుంట

నందవరం మండలం మాచాపురానికి చెందిన నలుగురు విద్యార్థులు శనివారం బహిర్భూమికి వెళ్లారు.. తర్వాత పక్కనే నీటికుంట వద్దకు వెళ్లగా హనుమేష్ (6), ఉదయ్‌కుమార్ (11)లు ప్రమాదవశాత్తు కుంటలో జారి పడ్డారు. వెంటనే మిగిలిన ఇద్దరూ గ్రామానికి వెళ్లి పెద్దలకు సమాచారం ఇచ్చారు.. వారంతా వచ్చి వెతికేలోపు ఇద్దరు చిన్నారులు మృత్యుఒడికి చేరారు. వీరిద్దరూ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్నారు. గ్రామంలో ఇద్దరు చిన్నారులు చనిపోవడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు జయమ్మ, భీమేష్, ఉరుకుందమ్మ, నడిపి రంగస్వామి రోదనలు మిన్నంటాయి.

అమ్మమ్మ ఊరొచ్చి..

ఎమ్మిగనూరు మండలం ఎస్.నాగలాపురానికి చెందిన సంపత్‌కుమార్ (12) తల్లితో కలిసి అమ్మమ్మ గ్రామమైన పార్లపల్లికి వచ్చాడు. శనివారం స్నేహితులతో కలిసి ఆడుకుంటూ గ్రామ సమీపంలోని వంక వద్దకు వెళ్లాడు. అక్కడ బహిర్భూమికి వెళ్లి తర్వాత వంకలోకి దిగారు. నీళ్లు ఎక్కువగా ఉండటంతో అందులో మునిగి చనిపోయాడు. 'చిన్నోడా బాగా చదువుతానంటివి.. ఉన్నతంగా రాణిస్తానంటివి.. అంతలోనే మాకు అందకుండా పోతివా" అంటూ తల్లిదండ్రులు శాంతికుమారి, మాణిక్ల రోదనలు మిన్నంటాయి.



విద్యా సమాచారం

డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: క్లస్టర్ వర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం అర్హులైన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ పొందవచ్చని రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్లు శనివారం సూచించారు. అడ్మిషన్లకు ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు వర్సిటీలోని పరిపాలన భవనంలో సంప్రదించాలన్నారు. ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో 295, కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో 481 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు.

ఉర్దూ వర్సిటీలోనూ..

నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు రిజిస్ట్రార్ లోకనాథ శనివారం తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు వర్సిటీలోని పరిపాలనా విభాగంలో సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : కిమ్స్-బొల్లినేని కళాశాలలో డిప్లొమా పారా మెడికల్ కోర్సులకు ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది నుంచి 8 డిప్లొమా పారా మెడికల్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 76809 45357, 79950 13422 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కలిసిరావాలని.. లాభాలు పొంగాలని

■ పేరుబలం చూసుకుని మరీ దరఖాస్తు
■ మద్యం దుకాణాలకు పెరుగుతున్న పోటీ

కర్నూలు, నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : జిల్లాలో మద్యం దుకాణాలకు సంబంధించి అనుమతుల దరఖాస్తుల నమోదు ప్రక్రియలో వేగం పెరిగింది. పలువురు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఆశావహులు దరఖాస్తు చేసుకుంటున్న తీరు గమనిస్తే ఎక్కువగా సెంటిమెంటుకు ప్రాధాన్యమిస్తున్నట్లు కనపడుతోంది. మద్యం అనుమతుల దరఖాస్తు ప్రక్రియ నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో పూజారులు, జ్యోతిష్యుల సందడి ఎక్కువగా ఉంది. దరఖాస్తుదారులు తమ కుటుంబంలో ఎవరి పేరున బలం ఉంది.. ఎవరి రాశి ఫలితం ఎలా ఉంది.. ఎవరి పేరుతో వ్యాపారం చేస్తే బాగా కలిసి వస్తుందో అడిగి తెలుసుకుంటున్నారు. ఏ రోజున దరఖాస్తు చేసుకోవాలి.. ఏ సమయంలో చేస్తే మంచిదో ముహూర్తాలు తెలుసుకుని మరీ దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఎప్పటినుంచో ఇదే సెంటిమెంటుతో కొందరు వ్యాపారులు, రాజకీయ నాయకులు తమ కుటుంబసభ్యుల పేర్లతో మద్యం అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంటున్న సంగతి విదితమే. ప్రస్తుతం కర్నూలులో పలు బార్ల అనుమతులు మహిళ పేర్లపై ఉండటమే ఇందుకు నిదర్శనం. కర్నూలు ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉండే ఓ హోటల్ యజమాని ఎప్పటి నుంచో తన కుటుంబసభ్యురాలి పేరుతో మద్యం వ్యాపారం సాగిస్తున్నారు. పెట్టుబడితో కూడిన వ్యాపారం కావటంతో కులమతాల కతీతంగా చాలామంది మంది సెంటిమెంటు అనుసరిస్తున్నారు.



కర్నూలు స్టేషన్ వద్ద మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ ఫ్లెక్సీ

తెలంగాణ, కర్ణాటక నుంచి రాక

జిల్లాలో మద్యం వ్యాపారం చేసేందుకు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పలువురు తరలివస్తున్నారు. గద్వాల జిల్లా, హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు కర్నూలు నగరంలో మద్యం దుకాణాలు ఏర్పాటుచేసే ఉద్దేశంతో దరఖాస్తు చేసుకునే విధానం అడిగి తెలుసుకుంటున్నారు. ఏ దుకాణానికి దరఖాస్తు చేసుకుంటే వ్యాపారం బాగుంటుందో స్థానికులతో చర్చిస్తూ ఆరా తీస్తున్నారు. ఆదోని, ఆలూరు, కోసిగి ప్రాంతాల్లో మద్యం దుకాణాల అనుమతుల కోసం కర్ణాటక రాష్ట్రానికి చెందిన వ్యాపారులు ప్రయత్నాలు చేస్తున్నారు. 5వ తేదీ సాయంత్రం వరకు ఆఫ్‌లైన్ ద్వారా పరిశీలిస్తే జిల్లావ్యాప్తంగా 99 దుకాణాలకుగాను 128 దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రీడ్ పద్ధతుల ద్వారా వచ్చిన దరఖాస్తుల వివరాలు చివరిరోజైన 9వ తేదీన వెల్లడికానున్నాయి.

22 దుకాణాలకు సున్నా దరఖాస్తులు

కర్నూలు జిల్లాలో 99 మద్యం దుకాణ అనుమతులకు సంబంధించిన దరఖాస్తుల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రభుత్వం గోప్యంగా ఉంచింది. శనివారం వరకు 77 దుకాణాలకు మాత్రమే దరఖాస్తులు అందాయి. ఐదు రోజులు గడిచినా 22 దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉండటంతో దరఖాస్తులు వచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. నంద్యాల జిల్లాలో 5వ తేదీ సాయంత్రం వరకు ఆఫ్‌లైన్ ద్వారా పరిశీలిస్తే జిల్లావ్యాప్తంగా 105 మద్యం దుకాణాలకుగాను 98 దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రీడ్ పద్ధతుల ద్వారా వచ్చిన దరఖాస్తుల వివరాలు చివరిరోజైన 9వ తేదీన వెల్లడికానున్నాయి.

స్టేషన్	మద్యం దుకాణాలు	ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు
కర్నూలు	31	45
కోడుమూరు	14	30
ఆదోని	12	8
ఆలూరు	9	18
ఎమ్మిగనూరు	15	7
కోసిగి	4	2
పత్తికొండ	14	18

ముగిసిన ఆర్‌యూ మహిళా కబడ్డీ పోటీలు


శ్రీసాయి కృష్ణ డిగ్రీ కళాశాల జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఉపకులపతి ఎన్‌టీకే.నాయక్ తదితరులు

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: గత రెండు రోజులుగా జరుగుతున్న ఆర్‌యూ అనుబంధ కళాశాలల మహిళా కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. నగరంలోని శ్రీసాయికృష్ణ డిగ్రీ కళాశాలలో జరిగిన తుది పోరులో శ్రీసాయికృష్ణ డిగ్రీ కళాశాల జట్టు, శ్రీలక్ష్మి బీపీడీ కళాశాలపై విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకుంది. సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. విజేత జట్లకు ఆర్‌యూ ఇన్‌ఛార్జి ఉపకులపతి ఎన్‌టికే. నాయక్, రిజిస్ట్రార్ డా.ఎస్.వెంకటేశ్వర్లు, శ్రీసాయికృష్ణ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యుడు ఎస్ఎండీ.జానీబాషా, కాంపిటేటివ్ ప్రిన్సిపల్ సుందర్‌రాజ్, ఆర్‌యూ విద్యాలయ క్రీడల సమన్వయకర్త శివకిషోర్‌లు బహుమతులు అందజేశారు.

కర్నూలు మీదుగా సికింద్రాబాద్-వాస్కోడిగామా రైలు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ నుంచి వాస్కోడిగామాకు నడిచే రైలును కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ మంత్రుల సమక్షంలో ఆదివారం సికింద్రాబాద్‌లో ప్రారంభించనున్నారు. ఈ రైలు షెడ్యూలును దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ.శ్రీధర్ శనివారం విడుదల చేశారు. బుధ, శుక్రవారాల్లో నడిచే ఈ రైలు (17039) ఈనెల 9న సికింద్రాబాద్‌లో ఉదయం 10.05 గంటలకు బయలుదేరి కర్నూలుకు మధ్యాహ్నం 13.50 గంటలకు, డోన్‌కు 15.20, వాస్కోడిగామాకు మరుసటి రోజు ఉదయం 5.45 గంటలకు చేరుకుంటుంది. వాస్కోడిగామా నుంచి బయలుదేరే రైలు (17040) గురు, శనివారాల్లో నడుస్తుంది. ఈ రైలు వాస్కోడిగామాలో ఉదయం 9 గంటలకు బయలుదేరి డోన్‌కు 22.50 గంటలకు, కర్నూలుకు 23.48 గంటలకు, సికింద్రాబాద్‌కు మరుసటి రోజు ఉదయం 6.20 గంటలకు చేరుకుంటుంది.

బన్ని ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

హొళగుంద, న్యూస్‌టుడే: బన్ని ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ బిందుమాధవ్, జాయింట్ కలెక్టర్ నవ్య సూచించారు. దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయ అర్చకులు ఎస్పీ, జేసీ, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు శనివారం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అధికారులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను చేశారు. పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య దేవరగట్టు పరిసర ప్రాంతాల గురించి ఎస్పీకి వివరించారు. దేవరగట్టు ఉత్సవాల పరిధిలోని గ్రామస్థులతో ఎస్పీ, జేసీ చర్చించారు. ఈ సందర్భంగా జేసీ, ఎస్పీ మాట్లాడుతూ.. ఐదు డ్రోన్లు, సీసీ కెమెరాలతో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. వైద్యం, విద్యుత్తు, నీటి వసతి, వాహనాల పార్కింగ్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ద్విచక్ర వాహనంపై దేవరగట్టు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెదేపా ఆలూరు నియోజకవర్గ తెదేపా బాధ్యుడు వీరభద్రగౌడ్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీఎంహెచ్‌వో, హొళగుంద తహసీల్దారు ప్రసాదరాజు, రెవెన్యూ, విద్యుత్తు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, ఎస్సైలు, జిల్లా అధికారులు, మాళమల్లేశ్వర స్వామి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


దేవరగట్టు పరిసరాలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ బిందు మాధవ్

పోటీ ఎక్కడైనా పతకమే!

◆ క్రికెట్‌లో జంషీర్ సత్తా ◆ ఈ ఏడాది చివరలో నేపాల్ పోటీలకు సాధన

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలోని ఇంజేటి కమాల్‌వలి, బీబీ దంపతుల కుమారుడు జంషీర్ రాష్ట్ర, జాతీయస్థాయి క్రికెట్‌లో రాణిస్తూ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. తల్లిదండ్రులు సాధారణ కొలిమి వృత్తి చేస్తూ కుమారుడి ఆసక్తిని గమనించి ఎంతగానో ప్రోత్సహించారు. కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని జంషీర్ ఒకవైపు చదువులోనూ రాణిస్తూ, మరోవైపు ఆటల్లోనూ రాణిస్తున్నారు. భవిష్యత్తులో ఐపీఎల్, దేశ క్రికెట్ జట్టులో ఆడేందుకు ప్రయత్నిస్తున్నట్లు జంషీర్ చెబుతున్నారు.

విద్యార్థి దశ నుంచే..

చాగలమర్రి పట్టణానికి చెందిన జంషీర్ విద్యార్థి దశ నుంచి క్రికెట్‌పై మక్కువతో పలు పాఠశాలల దశల్లో జరిగిన పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో సత్తా చాటారు. అనంతపురం జిల్లాలో పీవీకేకేఐటీ కళాశాలలో ఎంబీఏ చదువుతున్న సమయంలో పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయిలో రెండుసార్లు ప్రశంసాపత్రాలు దక్కించుకున్నారు. అనంతపురం ఆర్డీటీలో నిర్వహించిన పలు పోటీల్లోనూ రాణించారు.


జంషీర్, జాతీయస్థాయి క్రీడాకారుడు, చాగలమర్రి

జాతీయస్థాయికి ఇలా!

2024 జనవరిలో నంద్యాలలో సూపర్-7 క్రికెట్ పోటీల ఎంపికల్లో పాల్గొని జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఫిబ్రవరి 15నుంచి 17 వరకు కర్నూలు జిల్లా మద్దికెరలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జట్టును ద్వితీయ స్థాయిలో నిలిపారు. ఆయన ప్రతిభను గుర్తించి జాతీయస్థాయికి ఎంపిక చేశారు. ఈ ఏడాది జులైలో హరియాణాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటి సూపర్-7 క్రికెట్ పోటీల్లో ప్రశంసా పత్రాన్ని పొంది అంతర్జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఈ ఏడాది చివరిలో నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ స్థాయి సూపర్-7 జాతీయ జట్టు తరపున నేపాల్‌లో ఆడనున్నట్లు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో ఎంపీ నాగరాజు

సింహాచలం, న్యూస్‌టుడే: కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు శనివారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ స్వామి వారి ప్రసాదం అందజేశారు.


ఎంపీ నాగరాజుకు ప్రసాదం అందిస్తున్న ఏఈవో ఆనంద్‌కుమార్

శ్రీమఠంలో భక్తుల సందడి

మంత్రాలయం, న్యూస్‌టుడే: దసరాతోపాటు శని, ఆదివారాలు సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మంత్రాలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీమఠం మధ్వకారిడార్, మంత్రాలయం ప్రధాన వీధులు, తుంగభద్ర నదీతీరం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ముందుగా గ్రామదేవత మంచాలమ్మ, రాఘవేంద్ర స్వామి మూలబృందావనాన్ని దర్శించుకున్నారు. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు సంస్థాన పూజల్లో భాగంగా జయ, దిగ్విజయ, మూల రాములకు పూజలు చేశారు. దుర్గా నవరాత్రుల్లో భాగంగా విశేష పూజలు చేసి అలంకరించిన గ్రామ దేవత మంచాలమ్మకు హారతి ఇచ్చారు. ఉత్సవమూర్తి ప్రహ్లాద రాయలను నవరత్న రథాలపై ఉంచి మఠం ప్రాకారంలో ఊరేగించారు. సహాయ మేనేజర్ నరసింహమూర్తి, సహాయ పీఆర్వో బిందుమాధవ్, వ్యాజరాజాచార్, మఠం దివాన్ శ్రీకాంత్ ఆచార్ పాల్గొన్నారు.


శ్రీమఠంలో నవరత్న రథంపై ప్రహ్లాద రాయలను ఊరేగిస్తున్న భక్తులు

జీవో 117 రద్దు చేసేవరకు ఉద్యమం

■ ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిన గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో 117ను రద్దు చేసేవరకు ఉద్యమిద్దామని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి పిలుపునిచ్చారు. శనివారం ఓ మండపంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు, పదవీ విరమణ ఉపాధ్యాయులకు సన్మానం, విద్యార్థులకు ప్రతిభా పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించి విద్యారంగాన్ని దెబ్బ తీస్తున్నారని ఆరోపించారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 14 మంది పురస్కారాలు అందించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల, రాష్ట్ర నాయకులు పాండురంగయ్య, రవికుమార్, అశోక్‌కుమార్, ఎంఈవో మధుసూదన్‌రాజు, వీరన్న, సోమేశ్వరి, కళావతి పాల్గొన్నారు


పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించిన ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు

కౌతాళంలో 58.4 మి.మీ. వర్షం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా శుక్రవారం నుంచి శనివారం ఉదయం వరకు 24 మండలాల్లో వర్షం పడింది. పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. కౌతాళంలో అత్యధికంగా 58.4 మి.మీ. కురిసింది. హొళగుంద 46.8, ఆదోని 38.8, వెల్దుర్తి 37.4, ఆలూరు 28.4, కల్లూరు 28.0, కర్నూలు అర్బన్ 20.4, మద్దికెర 20.0, కృష్ణగిరి 19.4, కర్నూలు రూరల్‌లో 19.0 మి.మీ. పడింది. తుగ్గలి 18.8, హాలహర్వి 16.8, గోనెగండ్ల 16.2, మంత్రాలయం 15.2, గూడూరు 13.2, పత్తికొండ 10.4, సి.బెళగల్ 2.0, కోడుమూరు 0.6 మి.మీ.గా నమోదైంది. జిల్లా సగటున 17.4 మి.మీ.గా ఉంది. ఈనెల సాధారణ వర్షపాతం 110.2 మి.మీ. కాగా ఇప్పటివరకు 33.8 మి.మీ. పడింది.

16 నుంచి అందుబాటులోకి మరళి-1 రీచ్

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కౌతాళం మండల పరిధిలోని మరళి-1 ఇసుక రీచ్‌ను జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు వి.రవిచంద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రీచ్‌కు 2023లో పర్యావరణ అనుమతులు వచ్చాయని.. 2025 ఫిబ్రవరి వరకు ఇసుక తవ్వకాలు జరిపేందుకు అనుమతులు ఉన్నట్లు చెప్పారు. ఈనెల 16 నుంచి మరళి-1 ఇసుక రీచ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.


రీచ్‌ను పరిశీలిస్తున్న జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు వి.రవిచంద్

వీరశైవులు అన్నిరంగాల్లో రాణించాలి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: వీరశైవులు అన్ని రంగాల్లో రాణించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. వీరశైవ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగర శివారులోని వీవీఎస్ ఫంక్షన్ హాలులో వీరశైవ ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వీరశైవులకు అన్నివిధాలా అండగా ఉంటుందని చెప్పారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఖేలో ఇండియా ఖోఖో క్రీడాకారిణుల ఎంపిక

జే పంగులూరు, న్యూస్‌టుడే: సౌత్ జోన్ ఖేలో ఇండియా అండర్-17, -14 సంవత్సరాల ఖోఖో క్రీడాకారిణులను జే పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాల మైదానంలో శనివారం ఎంపిక చేశారు. ఎంపిక పోటీలను ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి, రిఫరీబోర్డు కన్వీనర్ ఎంవీఎస్ఎస్.ప్రసాద్, జె.పాల్ తదితరులు పర్యవేక్షించారు. అండర్-14, 17 విభాగాల్లో కర్నూలుకు చెందిన హారిక, అర్చనశ్రీ లు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారిణులు ఈ నెల 16-18 తేదీల్లో తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగే జాతీయస్థాయి ఖేలో ఇండియా ఖోఖో పోటీల్లో పాల్గొననున్నారు.



రూ.లక్ష విరాళం

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: వరదబాధితుల సహాయార్థం తెదేపా రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. ఉండవల్లిలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసి శనివారం చెక్కును అందజేశారు. ఆదోని నియోజకవర్గ పరిస్థితుల గురించి వివరించి, అభివృద్ధికి సహకారం అందించాలని మంత్రిని కోరారు. అనంతరం మంత్రి నారాయణను కలిసి ఆదోనిలో భూగర్భ కాల్వల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని 104 వైద్యాధికారి భువన తేజ సూచించారు. రామళ్లకోట గ్రామంలో వైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెచ్ఐవీ పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. అనంతరం గ్రామస్థులకు రక్త పరీక్షలు చేపట్టారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆదోని: 77996 66004 ఆలూరు: 80085 62277 పత్తికొండ: 8008573822

ఆస్పరి, న్యూస్‌టుడే: సమస్య: గ్రామంలోని ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గుంతలు పడ్డ రహదారికి మరమ్మతులు చేయాలి. -వీరేష్, రవీంద్ర, కైరుప్పల

సమాధానం: ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. నిధులు మంజూరు అయితే మరమ్మతులు చేయిస్తాం. -శ్వేత, ఆర్‌అండ్‌బీ ఏఈ, పత్తికొండ

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని మేదరపేటలో కొత్త ఆశా వంతెన ముఖమార్గంలో చెత్త పేరుకుపోయింది. వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. - ఈరన్న, ఆదోని

సమాధానం: ప్రజారోగ్య విభాగం ద్వారా శుభ్రత పనులు చేయించి, సమస్యను పరిష్కరిస్తాం. -కృష్ణ, పురపాలక కమిషనర్, ఆదోని

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ బిందుమాధవ్ పేర్కొన్నారు. ఆదోని డీఎస్పీ కార్యాలయాల్లో శనివారం సాయంత్రం పెండింగ్ కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కేసుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసి దస్త్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మట్కా, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలు పూర్తిగా నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. [illegible] రికవరీ చాలా తక్కువగా ఉందని, [illegible] పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలన్నారు. దసరా ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని వివరించారు. ఆదోని, ఎమ్మిగనూరు డీఎస్పీలు సోమన్న, ఉపేంద్రబాబు, శిక్షణ డీఎస్పీ దీపక్, సీఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

దిగుబడి లేక.. ధర రాక

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ధర లేక కొందరు వేరుశనగ రైతులు పడిగాపులు కాస్తున్నారు. శుక్రవారం నియోజకవర్గంతో పాటు డివిజన్‌లోని పలు మండలాలు, గ్రామాల నుంచి రైతులు వేరుశనగ దిగుబడులను అమ్మకానికి తీసుకొచ్చారు. అదే సమయంలో కుండపోత వర్షం కురవడంతో అప్పటికే టెండరు ప్రక్రియ ముగిసి, ధరలు ప్రకటించారు. ఈ తరుణంలో పలు దిగుబడులకు క్వింటా రూ.3 వేల నుంచి రూ.4 వేల లోపు ధర నిర్ణయించడంతో రైతులు సరకు ఇచ్చేందుకు విముఖత చూపారు. వర్షం కారణంగా దిగుబడులు పూర్తిగా తడిచి ముద్దయ్యాయి. ధర తగ్గిండంపై వ్యాపారులను ప్రశ్నిస్తే తేమ కారణంగా చూపుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇదే సరకు పలు చోట్ల క్వింటా రూ.5 వేలు ధర పలుకుతోందని.. కొందరికి మాత్రమే మంచి ధరలు దక్కుతున్నాయని, తేమ పేరుతో ధరలను తగ్గిస్తున్నారని రైతులు మండిపడ్డారు. చేసేది లేక మంచి ధర వచ్చేంత వరకు యార్డులో సరకు ఆరబెట్టుకొని ఎదురుచూస్తున్నారు. తుపాను కారణంగా అధికారులు శనివారం యార్డుకు సెలవు ప్రకటించారు. ఆదివారం సాధరణ సెలవు కావడంతో 7వ తేదీ సోమవారం తిరిగి వ్యాపారాలు ప్రారంభమవుతాయి. దీంతో మూడు రోజులు రైతులు యార్డులో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది.



యార్డులో ఆరబోసిన వేరుశనగలు

అతివృష్టి.. అనావృష్టి

ఎప్పటిలాగే ఈ ఏడాది రైతులు అతివృష్టి.. అనావృష్టి కారణంగా నష్టపోవాల్సి వచ్చింది. ఆదోని మండలంలో ఈసారి 4,200 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. సబ్ డివిజన్ పరిధిలో 15 వేల నుంచి 18 వేల ఎకరాల్లో సాగుచేశారని అంచనా. విత్తనాలు, మందులు, కలుపు, పంట కోత, కూలీ ఖర్చులు అన్ని కలిపి ఎకరాకు రూ.30 వేలు ఖర్చు చేశారు. బాగా పండితే సరాసరి 7-8 క్వింటాళ్ల దిగుబడులు చేతికి రావాలి. అయితే సగానికి సగం పంట దిగుబడి తగ్గిందని రైతులు వాపోతున్నారు. దిగుబడులు అమ్మేందుకు యార్డుకు వచ్చిన రైతుకు రోజుకు రూ.400 చొప్పున మూడు రోజులకు రూ.1,200 అదనపు ఖర్చు అవుతోందిని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తేమ పేరుతో కోత

12 ఎకరాలు కౌలుకు తీసుకున్నా



12 ఎకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ సాగు చేశాను. ఎకరాకు కౌలు రూ.7 వేలు చెల్లించాను. సాగు కోసం ఎకరాని రూ.35 వేలు ఖర్చు అయ్యింది. 28 సంచులు సరకు చేతికి రావడంతో ఆదోని యార్డులో 4వ తేదీన అమ్మకానికి తీసుకువచ్చాను. క్వింటా రూ.3,800 ధర నిర్ణయించారు. ఈసారి దిగుబడి తక్కువగా వచ్చింది. పంట చేతికి వచ్చే సమయానికి అధిక వర్షాలతో నష్టపోయాను. చేతికి వచ్చిన సరకును ఆదోని యార్డుకు తీసుకువస్తే ధర లేదు.

గత వారం రూ.5200



నాలుగు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశాను. 28 సంచుల దిగుబడులను ఆదోని మార్కెట్ యార్డుకు అమ్మకానికి తీసుకొచ్చాను. శుక్రవారం క్వింటా రూ.3100 నమోదు చేశారు. ఇదే సరకు గత వారం క్వింటా రూ.5,200 పలికింది. వారం రోజుల వ్యవధిలో ఇంతలా ధర వ్యత్యాసం చూపడంతో చాలా నష్టపోవాల్సి వస్తోంది. వ్యాపారులు సరకు తేమగా ఉంది, గింజ నాణ్యత తగ్గింది ఏదో సాకులు చెబుతున్నారు. చేసేది లేక ఇక్కడే పంట ఆరబోసుకుని యార్డు తెరిచిన తరువాత అమ్ముకొని వెళ్తాను.

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ఆలూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8న ఆలూరులో నిర్వహించే ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి పేర్కొన్నారు. స్కిల్ హబ్ కోఆర్డినేటర్ వీరేశ్‌తో కలిసి శనివారం ఉద్యోగమేళాకు సంబంధించిన వివరాలను తెలిపారు. పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు.

ఏబీఆర్ఎస్ఎం జాతీయ కార్యదర్శిగా రాజశేఖర్‌రావు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్(ఏబీఆర్ఎస్ఎం) జాతీయ కార్యదర్శిగా ఆదోని పట్టణానికి చెందిన రాజశేఖర్‌రావు ఎన్నికయ్యారు. భోపాల్‌లో జరుగుతున్న ఏబీఆర్ఎస్ఎం జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన్ను శనివారం ఎన్నుకున్నారు. ఆయన ఎన్నికపై జిల్లా కమిటీ నాయకులు తాయప్ప, శ్రీనివాసులు, రామకృష్ణారావు, భైరప్ప, జ్ఞానేశ్వరరావు, దేవేంద్రనాథ్‌రెడ్డి, ప్రతాప్‌సూర్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

అండగా ఉంటాం



విత్తనాలు పంపిణీ చేస్తున్న వీరభద్రగౌడ్

హాలహర్వి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఆలూరు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి వీరభద్ర గౌడ అన్నారు. హాలహర్విలో రాయితీపై పప్పుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 25శాతం రాయితీతో విత్తనాలు అందిస్తున్నారు. గతంలో ఎకరానికి 25 కిలోలు ఇచ్చేవారని, తమ ప్రభుత్వం ఒక్కో రైతుకు 40 కిలోలు చొప్పున అందిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే పంటలు సాగులో కర్షకుల సలహాలు, సూచనలు అందించేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్డుపై గుంత.. ప్రమాదాల చెంత



దేవనకొండ సమీపంలోని కర్నూలు-బళ్లారి రహదారిపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. కప్పట్రాళ్ల, కరిడికొండ, ఈదుల దేవరబండ ప్రాంతాల్లో పలు చోట్ల రహదారిపై గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, దేవనకొండ

మూడోసారి నీటి గొట్టం లీకేజీ

ఆదోని పట్టణంలోని కోట్ల కూడలిలో నీటి సరఫరా ప్రధాన గొట్టం లీకేజీ అయ్యింది. ఈ ఏడాదిలో ఇలా కావడం ఇది మూడోసారి. లీకైన ప్రతిసారి నిధులు ఖర్చు చేస్తున్నా శాశ్వతంగా సమస్యను పరిష్కరించడం లేదు. 167 జాతీయ రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ఇలాంటి తరుణంలో నీటి గొట్టం లీకేజీ కారణంగా పలు కాలనీలకు నీటి సరఫరాలో అంతరాయంతో పాటు ట్రాఫిక్ సమస్యలతో పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పురపాలక నీటి విభాగాధికారులు నాణ్యతగా మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ఆదోని పాతపట్టణం



జలమయమైన రహదారులు



వెల్దుర్తి మండలంలో శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రహదారులు, పంట పొలాలు జలమయమయ్యాయి. రామళ్లకోట గ్రామంలోని తేరు బజారు, బోయపేటలోని రహదారులపై వర్షం నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పొలాల్లో వర్షం నీరు చేరడంతో జొన్న, మిరప పంటలు దెబ్బతిన్నాయి. -న్యూస్‌టుడే, వెల్దుర్తి

భూ వివాదంపై తహసీల్దారు విచారణ

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పత్తికొండ పట్టణ పరిధిలోని సర్వే నం.724/2లో 16.19 ఎకరాల భూమికి సంబంధించి పత్తికొండ తహసీల్దారు రమేష్ విచారణ చేపట్టారు. ఇరువర్గాలను స్థానిక రెవెన్యూ కార్యాలయానికి శనివారం పిలిపించారు. 16.19 ఎకరాల్లో 3.10 ఎకరాల భూమి [illegible] పాతిమా అనే మహిళ పేరుతో ఆన్‌లైన్‌లో మార్పారని రైతు ఉప్పరి నాగభూషణం ఆరోపించారు. ఎప్పటి నుంచో వ్యవసాయం చేసుకుంటున్నామని ఆ భూమి తమదే అంటూ పాతిమా అనే మహిళ వాదించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అక్కడి నుంచి పాతిమా కుటుంబ సభ్యులు వెళ్లిపోగా నాగభూషణం మాత్రం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తమ భూమిని అన్యాయంగా ఇతరులకు దారాదత్తం చేసేలా దస్త్రాలు మార్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్య పనులు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: పట్టణంలో పాత ఆశా వంతెన కింది భాగంలో పాటు వాణిజ్య ప్రాంతాల్లో పురపాలక కమిషనర్ కృష్ణ శనివారం పర్యటించారు. వర్షం కారణంగా [illegible] శుభ్రత పనులను పర్యవేక్షించారు. కార్యాలయంలో సచివాలయ పట్టణ ప్రణాళిక విభాగ సిబ్బందితో సమావేశమయ్యారు. సహాయ కమిషనర్ డా.అనుమమ, ఏసీపీ కృష్ణసింగ్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం కురిసిన వర్షానికి పంట దిగుబడులు తడిసిపోయిన రైతులను ఆదుకోవాలని భాజపా సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌జైన్ డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డులో [illegible] కున్న రైతులను శనివారం పరామర్శించారు. వర్షం వల్ల రైతులు వరసగా నష్టపోతున్న అధికారులు నివారణ చర్యలు చేపట్టకపోవడం సరికాదన్నారు.

రైతు సంక్షేమమే భాజపా ధ్యేయం

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: దేశంలో



రైతులను సన్మానిస్తున్న భాజపా నాయకులు

రైతుల సంక్షేమానికి భాజపా కట్టుబడి ఉందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ అన్నారు. మండలంలోని దనాపురం సచివాలయంలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కార్యక్రమాన్ని శనివారం రైతులతో కలిసి ఆ పార్టీ నాయకులు ప్రత్యక్ష ప్రసారంగా వీక్షించారు. అనంతరం రైతులను సన్మానించారు. 18వ విడత కింద జిల్లాలోని 2,45,252 మంది లబ్ధిదారులకు రూ.49.05 కోట్లు ప్రయోజనం కలిగిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో-కన్వీనర్ నాగరాజుగౌడ్, ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్రకుమార్, బీజేవైఎం నాయకులు విశ్వనాథ్, వ్యవసాయ శాఖాధికారులు ఏఈ సతీష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నవదుర్గా రూపం.. తేజోమయం



ఆదోని గ్రామీణం: పెద్ద హరివాణంలో అన్నపూర్ణదేవిగా...



ఆలూరు: మంగళగౌరీ దేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



ఆదోని సాంస్కృతికం: అన్నపూర్ణాదేవిగా అంబా భవానీ

శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మూడోరోజు అమ్మవారు వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు శనివారం దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలుచోట్ల అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. -న్యూస్‌టుడే బృందం



ఆదోని సాంస్కృతికం: నవ ధాన్యాల అలంకరణలో వీరభద్రస్వామి



పత్తికొండ గ్రామీణం: గాయత్రీదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



ఆదోని పాతపట్టణం: రాజ్మా, పల్లీలతో లక్ష్మమ్మవ్వ



ఆదోని పాతపట్టణం: ఎండు ద్రాక్ష, గోడంబి అలంకరణలో..



మద్దికెర: నగరేశ్వరాలయంలో అన్నపూర్ణేశ్వరి అలంకరణలో



వెల్దుర్తి: గాయత్రీదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



దేవనకొండ: ప్రత్యేక పూజలందుకున్న జగన్మాత



ఆస్పరి: జొహరాపురంలో అన్నపూర్ణదేవిగా...

బాధితులపై కేసు నమోదు చేయడం సరికాదు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: పెద్దకడబూరు మండలం చిన్నతుంబళం గ్రామానికి చెందిన లేపాక్షినాయుడు, తాయన్న, కవితలపై దాడి చేసిన నిందితులపై కాకుండా బాధితులపై పోలీసులు కేసు నమోదు చేయడం సరికాదని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. ఆస్పత్రి చికిత్స పొందుతున్న బాధితులను వారు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ప్రమేయంతోనే బాధితులపై కేసు నమోదు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. దీనిపై జిల్లా అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు ఖాదర్ బాషా పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని మండలం కడితోట గ్రామానికి చెందిన శాంతిరాజుపై దాడి చేసిన రాముడు, బ్రహ్మయ్య, అంజిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు డిమాండు చేశారు. ఆదోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శాంతిరాజును వారు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాంతియుతంగా జీవనం సాగిస్తున్న శాంతిరాజుపై అనవసరంగా దాడికి పాల్పడడం దారుణమన్నారు. వెంటనే నిందితులను అరెస్టు చేయాలని కోరారు.



బాధితుడిని పరామర్శిస్తున్న కేవీపీఎస్ నాయకులు

ఆర్డీవోకు వీడ్కోలు

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి బదిలీపై వెళ్తున్న సందర్భంగా శనివారం సాయంత్రం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ అధికారులు సిబ్బంది ఆమెను శాలువా, పూల మాలతో సత్కరించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, రెవిన్యూ సిబ్బంది తలదిత రులు పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో నియోజకవర్గ పరిధిలో విధులను సక్రమంగా నిర్వర్తించేలా సిబ్బందికి ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు అందజేశారని అధికారులు కొనియాడారు.



ఆర్డీవోకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉద్యోగులు

ఆదోని రైల్వే ఎస్సైకి అవార్డు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని రైల్వే ఎస్సై గోపాల్‌కు రాష్ట్ర డీజీపీ ద్వారాకా తిరుమలరావు ఏబీసీడీ అవార్డును విజయవాడలో శనివారం ప్రదానం చేశారు. గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని కదిరి రైల్వే స్టేషన్‌లో కదులుతున్న రైలులోని ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కొని ఆమెను కిందికి తోసిన కేసు చేధనకు కృషి చేసిన బృందంలో గోపాల్ సభ్యునిగా ఉన్నారు. ఈ కేసు చేధకు కృషి చేసిన గుంతకల్లు రైల్వే సీఐ నాగేశ్‌బాబు, గుత్తి ఆర్‌పీఎఫ్ సీఐ అనురాగ్‌కుమార్, చిత్తూరు రైల్వే ఎస్సై ప్రవీణ్‌కుమార్, కానిస్టేబుల్ ఉసేన్, ఐటీ సభ్యుడు సమీర్ కలిసి ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం లక్నోకు చెందిన నిందితులు అభయ్‌రాజ్‌సింగ్, సన్నిమల్‌హోత్రా, శివంచౌహాన్ అనే నిందితులను అరెస్టు చేసి వారి నుంచి సొత్తు రికవరీ చేశారు.



డీజీపీ నుంచి ధ్రువపత్రం తీసుకుంటున్న ఎస్సై కె.గోపాల్

పేదల కాలనీలు.. సమస్యల వలయాలు

పత్తికొండ గ్రామీణం, పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పత్తికొండ పట్టణ శివారులో పేదలు నివసిస్తున్న దిడ్డిచేను కాలనీ, బాబు జగ్జీవన్‌రాం కాలనీ, వీకే ఆదినారాయణరెడ్డి కాలనీల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. కాలనీలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకు అక్కడ సీసీ రహదారులు, కాల్వలు ఏర్పాటు చేయలేదు. ఆయా కాలనీల్లో రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ సుమారు 250 కుటుంబాలకు పైగా జీవనం సాగిస్తున్నాయి. ఇప్పటికీ వారానికి ఒక సారి నీటి సరఫరా చేయడంతో తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారు. కాలనీ చుట్టుపక్కల ముళ్ల కంపలు పెరిగిపోయి పాములు, విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. కూలీ పనులు ముగించుకొని చీకటిపడిన తర్వాత ఇళ్లకు చేరుకోవాలంటే గతుకుల రహదారులతో మహిళలు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాలనీల్లో ఎక్కడ చూసినా మట్టి రోడ్లు ఉండటంతో చిన్నపాటి వర్షం కురిసినా బురదమయంగా మారుతున్నాయి. గత ఐదేళ్ల కాలంలో వైకాపా ప్రభుత్వం కాలనీ సమస్యలపై పట్టించుకున్న పాపాన పోలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఆయా కాలనీల్లో వసతులు కల్పించాలని కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న మినీ ట్యాంకులు



దిడ్డిచేను కాలనీలోని మట్టి దారి

వారానికోసారి తాగునీటి సరఫరా

-మాబూన్నీ, దిడ్డిచేను కాలనీవాసి

దిడ్డిచేను కాలనీలో దాదాపు 150 కుటుంబాలు, 500 మందికి పైగా జనాభా ఉన్నారు. కానీ తాగునీటి సరఫరా సక్రమంగా చేపట్టడం లేదు. ఇప్పటికీ వారానికి ఓసారి మాత్రమే నీరు వస్తోంది. అరకొరగా వచ్చిన నీరు రెండు మూడు రోజులు మాత్రమే సరిపోతుంది. మిగతా రోజుల్లో వేరే కాలనీలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. అధికారుల స్పందించి వారానికి రెండుసార్లు నీటిని సరఫరా చేయాలి.

మట్టి దారుల్లో అవస్థలు

-సాలమ్మ, దిడ్డిచేను కాలనీ

కాలనీ ఏర్పడి 15 ఏళ్లు దాటినా సమస్యలతో కొట్టిమిట్టాడుతున్నాం. రోడ్లు లేక అవస్థలు పడుతున్నా ఇంత వరకు ఎవరూ పట్టించుకోలేదు. మురుగు కాల్వలు లేకపోవడంతో ఇళ్ల వద్ద మురుగు నిలిచి అవస్థలు పడుతున్నాం. కాలనీలో ఎక్కడ చూసినా అపరిశుభ్రత, ముళ్ల కంపలు పెరిగిపోయాయి. మురుగు కారణంగా కాలనీవాసులు తరచూ జ్వరాల బారిన పడుతున్నారు. కాలనీలో రహదారులతో పాటు కాల్వలు ఏర్పాటు చేయాలి.

కుళాయిలు ఏర్పాటు చేశాం

-నరసింహులు, పత్తికొండ గ్రామ పంచాయతీ ఈవో

దిడ్డిచేను కాలనీ, వీకే ఆదినారాయణరెడ్డి నగర్ కాలనీల్లో తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశాం. ఆయా కాలనీల్లో తాగునీటి సమస్య లేదు. కొంత మేర రహదారుల సమస్య ఉంది. కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరా చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

బాధ్యతల స్వీకరణ

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని పుల్లగుమ్మి, చెరుకులపాడు, కలుగొట్ల వీఆర్వోలుగా ఎల్లకృష్ణ, రమణారెడ్డి, మౌలాలి శనివారం బాధ్యతలు స్వీకరించారు. వారు మాట్లాడుతూ.. రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తామన్నారు.

మద్దికెర ఉప తహసీల్దారుగా శ్రీదేవి

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెర ఉప తహసీల్దారు శ్రీదేవి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఎమ్మిగనూరు ఉప తహసీల్దారుగా పని చేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఉప తహసీల్దారు పురుషోత్తముడు సి. బెళగల్‌కు బదిలీ అయ్యారు.

సీనియర్ అసిస్టెంటుగా రవికుమార్

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెర రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న రవికుమార్ సీనియర్ సహాయకునిగా పదోన్నతి లభించింది. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సునీత ఆర్‌ఐగా పదోన్నతిపై చిప్పగిరికి బదిలీ అయ్యినట్లు తహసీల్దారు హుస్సేన్‌సాహెబ్ తెలిపారు.

పత్తికొండ సర్వేయర్‌గా గాదిలింగప్ప

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పత్తికొండ మండల నూతన సర్వేయర్‌గా గాదిలింగప్ప శనివారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయానికి వచ్చిన ఆయనకు సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు స్వాగతం పలికారు.

పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీగా కృష్ణసింగ్

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పురపాలక సంఘంలో పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ(అసిస్టెంట్ సీటీ ప్లానర్)గా కృష్ణసింగ్ నియమితులైయ్యారు. ఇక్కడ ఏసీపీగా పని చేస్తున్న శ్రీనివాస్‌నాయక్ గుంతకల్లుకు బదిలీ అయ్యారు.

లారీ ఢీకొని బాలుడికి తీవ్రగాయాలు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణ శివారు ఆస్పరి రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొనడంతో జయదీప్ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. కర్ణాటక రాష్ట్రం బి.ఎం.సూగూరుకు చెందిన బసవరాజు, అతని కుమారుడు జయదీప్ ద్విచక్ర వాహనంపై ఆస్పరి మండలం హలిగరకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తా చాటాలి



క్రీడాకారులతో మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: క్రీడాకారులు కృషి, పట్టుదలతో సాధన చేస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చని మల్లెల గ్రూప్ సంస్థ ఛైర్మన్ మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు అన్నారు. శనివారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించి సాయమందించారు. కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రతిభ సాధిస్తే చేయూతనిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యుడు ప్రసాద్, విక్రమ్, ముని, రఘు, ఈరన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువు తయారీకి సిద్ధం చేయాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: చెత్త నిల్వలను సేంద్రియ ఎరువు తయారు చేసేందుకు యంత్రాలతో సిద్ధం చేయాలని పురపాలక కమిషనర్ గంగిరెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన సోగనూరు మార్గంలోని యంత్రాలు, తొట్టెలను, డంపింగ్ యార్డును పరిశీలించి మాట్లాడారు. కంపోస్టు ఎరువుల తయారీని గుత్తేదారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట డీఈ నీరజా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు గ్రామీణం : 80085 73794
కోడుమూరు : 80085 73776

కోసిగి: **సమస్య:** కోసిగిలో కొన్ని కాలనీలకు తాగునీరందించేందుకు బుగెని చెరువులో ఏర్పాటు చేసిన ట్యాంకు నుంచి రాత్రిపూట నీరు వృథాగా పోతోంది.
– రామకృష్ణ, స్థానికుడు

సమాధానం: లైన్‌మెన్‌కు తెలియజేసి నీరు వృథా కాకుండా మోటార్ ఆఫ్ చేయిస్తాం.
– తిరుమలేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి

నందవరం: **సమస్య:** నందవరంలోని బీరప్ప స్వామి ఆలయం ఎదుట తాగునీటి పైపులైను లీకేజీ అవుతోంది. రహదారిపైకి నీరు వృథాగా పోతోంది. సమస్య పరిష్కరించగలరు. – నరసింహులు, నందవరం

సమాధానం: సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. – శివారెడ్డిగౌడ్, ఉప సర్పంచి

కాల్వలు శుభ్రం చేయండి.. సీసీ దారులు నిర్మించండి

కమిషనర్‌తో ఈనాడు ఫోన్‌ఇన్‌కు భారీ స్పందన



ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: తాగునీటి సమస్య, రహదారిలో గుంతలు, మురుగు కాల్వలు అధ్వానం తదితర సమస్యలపై ఎమ్మిగనూరు పురపాలక కమిషనర్ గంగిరెడ్డితో శనివారం ఈనాడు ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించింది. వీటికి పట్టణ ప్రజల నుంచి భారీ స్పందన వచ్చింది. పురప్రజలు తమ సమస్యలను చరవాణి ద్వారా కమిషనర్ దృష్టికి తీసుకురాగా, ఆయన సమాధానాలు ఇచ్చి పరిష్కారం చూపారు.

సమస్య: 13వ వార్డులో కాల్వలో చెత్త తొలగించడం లేదు. నెల రోజులైనా శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది. పిల్లలకు జ్వరాలు వ్యాపిస్తున్నాయి.
– బాషా, 13వ వార్డు, గురుప్రసాద్, ఎన్‌ఎంటీ కాలనీ ఐదో లైన్

సమాధానం: సాయంత్రంలోపు కాల్వలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పొడి చల్లిస్తాం.

సమస్య: గాంధీనగర్ తిరుమల్ డెయిరీ ఎదురుగా కల్వర్టుకు రంధ్రం పడింది. వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. చిన్నపిల్లలు ఆడుతూ మ్యాన్‌హోల్‌లో పడే ప్రమాదముంది. రంధ్రాన్ని పూడ్చండి.
– శ్రీకాంత్, గాంధీనగర్

సమాధానం: గుంతపై రాయి వేసి సిమెంట్, కంకర వేయించి పూడ్చివేయిస్తాం. రెండు రోజుల్లో పనులు పూర్తి చేయిస్తాం.

సమస్య: వడ్డె వీధి మసీదు రోడ్డు వెనుక బోరు చెడిపోయింది. తాగునీటిని నిత్యం అవస్థలు పడుతున్నాం. బోరుకు మరమ్మతులు చేయించగలరు.
– ఇస్మాయిల్, వడ్డె వీధి

సమాధానం: రెండు రోజుల్లోపు మోటారుకు మరమ్మతులు చేయిస్తాం.

సమస్య: సున్నంబట్టీ వీధిలో కాల్వలు శుభ్రం చేయడం లేదు. రాత్రివేళ దోమలు విపరీతంగా ఉంటున్నాయి. జ్వరాల బారిన పడుతున్నాం. – ఎల్లప్ప

సమాధానం: కాల్వలు శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.

సమస్య: బిలాల్ మసీదు వెనుక వీధిలో రహదారి గుంతలు పడింది. వర్షం వస్తే కాల్వలు లేక నీరంతా నిలిచి మడుగుగా మారుతోంది. రహదారికి మరమ్మతులు చేపట్టగలరు.
– లక్ష్మన్న, బిలాల్ మసీదు వీధి

సమాధానం: సాధారణ నిధుల కింద పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపిస్తాం.

సమస్య: మాచాని తిమ్మప్ప కాలనీ ఆరో లైన్‌లో తాగునీటికి అవస్థలు పడుతున్నాం. పది రోజులైనా నీరు రావడం లేదు. సమస్య తీర్చండి.
– దేవమణి, తిమ్మప్ప కాలని

సమాధానం: మా సిబ్బందిని పంపించి సమస్య ఎక్కడ ఉందో తెలుసుకుని తక్షణమే పరిష్కరిస్తాం.

సమస్య: 9వ వార్డులోని రహదారిలో మోకాలు లోతు గుంతలు తీశారు. కంకర, రాళ్లు వేసి వదిలేశారు. నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నాం. రహదారిని బాగు చేయించండి. – జబ్బార్, కాలనీవాసి

సమాధానం: రహదారి నిర్మాణానికి గుత్తేదారుడు గుంతలు తవ్వారు. పనులు వేగవంతంగా చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

సమస్య: గాంధీనగరలో ఒకటో రహదారిలో గుంతలు పడ్డాయి. భూగర్భ మురుగు కాల్వ నిర్మాణానికి తవ్విన దారికి మరమ్మతులు చేపట్టలేదు. పదే పదే ఇబ్బందులు పడుతున్నాం.
– లక్ష్మన్న, కాలనీవాసి

సమాధానం: రహదారి నిర్మాణానికి రూ.10 లక్షలతో టెండర్లు పూర్తయ్యాయి. పనులు త్వరగా చేస్తాం.

సమస్య: టీబీపీ కాలనీలో ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం వేశారు. నీరు దుర్వాసన వస్తోంది. పలుమార్లు అధికారులకు విన్నవించినా శుభ్రం చేయడం లేదు. చర్యలు తీసుకోగలరు.
– ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయుడు, టీబీపీ కాలని

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయిస్తాం.

సమస్య: శివన్ననగర్, వీవర్స్ కాలనీ, ముగతిపేట, ఎన్టీఆర్ కాలనీలో కుక్కల బెడద అధికంగా ఉంది. రాత్రివేళ రోడ్డుపైకి వస్తే వెంటపడి కరుస్తున్నాయి. చర్యలు తీసుకోండి.
– జయరాం, ఎన్టీఆర్ కాలనీ, లక్ష్మన్న, నారాయణ, నీలకంఠ ఎన్టీఆర్ కాలనీ



ప్రజలకు సమాధానాలు ఇస్తున్న కమిషనర్ గంగిరెడ్డి

సమాధానం: కుక్కలు పట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నెల రోజుల కిందట కొన్ని కుక్కలు పట్టాం. కు.ని. శస్త్రచికిత్సలు చేయించి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

సమస్య: మునెప్ప నగర్ ప్రధాన రహదారిలో కాల్వలు పూడికతో నిండిపోయింది. మురుగు నిలిచి దుర్వాసన, దోమల బెడద అధికమైంది. – ప్రభు, మునెప్పనగర్

సమాధానం: శానిటరీ సిబ్బందిని పంపించి కాల్వలో పూడిక తొలగింపజేస్తాం.

సమస్య: మార్కెట్ రోడ్డు కూడలి నుంచి మంత్రాలయం దారిలో సెంట్రల్ లైటింగ్ రాత్రి పూట వెలగడం లేదు. మరమ్మతులు చేయించగలరు. – సోమేశ్

సమాధానం: సిబ్బందిని పంపించి బాగు చేయిస్తాం.

సమస్య: కృష్ణ ఏరియాలో కల్వర్టును తొలగించారు. రెండేళ్లుగా కాలినడకకు దారి లేదు. వర్షం వస్తే మా కాలనీలో 140 ఇళ్లకు దారి ఉండదు. కొత్త కల్వర్టు నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టాలి.
– నారాయణ, శ్రీనివాసులు, ఆంజనేయులు, నాగన్న, తాయప్ప, వీరభద్ర, నాగరాజు

సమాధానం: వంతెనలు నిర్మించేందుకు సుమారు రూ.30 లక్షలతో టెండర్లు పిలిచాం. పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

సమస్య: టీచర్స్ కాలనీకి వెళ్లే దారిలో మూడు వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి పూట చీకటిగా ఉంటోంది. దీపాలను అమర్చండి. – సుధాకర్, ఉపాధ్యాయుడు

సమస్య: వేణు విద్యాలయం, సోమేశ్వర టాకీస్ వెనుక భాగంలోని రెండు వీధుల్లో కంకర తేలి దారి అధ్వానంగా ఉంది. కొత్త దారి నిర్మించగలరు.
– వీరేశ్, మూడో వీధి, ఆంజనేయులు, ఐదో వీధి లక్ష్మిపేట

సమాధానం: రెండు వీధుల్లో సీసీ దారుల నిర్మాణానికి టెండర్లు పూర్తి చేశాం. గుత్తేదారులు పనులు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

సమాధానం: కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం.

సమస్య: వెంకటాపురం రహదారిలోని మారెమ్మ గుడి వద్ద దారి, కాల్వల్లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రతిరోజూ కాల్వల్లో నీరంతా రోడ్లపైకి వస్తోంది. సమస్యను పరిష్కరించండి. – రంగన్న, కాలనీవాసి

సమాధానం: కొత్తగా కాల్వల కోసం ప్రతిపాదనలు తయారు చేసి నిర్మాణాలు చేపడతాం.

సమస్య: తేరుబజార్‌లో బోయమ్మ గుడి వరకు రహదారి గుంతలు పడింది. ప్రతిరోజూ పిల్లలు కింద పడుతున్నారు. గుంతలు పూడ్చండి. – నరసింహులు, కాలనీవాసి

సమాధానం: సీసీ దారికి రూ.15 లక్షలతో టెండర్లు పూర్తి చేశాం. గుత్తేదారుడు పనులు చేపట్టేందుకు రాలేదు, తాత్కాలికంగా గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

రాఘవేంద్రస్వామి సన్నిధిలో ప్రముఖులు



కర్ణాటక మంత్రి శివరాజు తంగడిని ఆశీర్వదిస్తున్న పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు

మంత్రాలయం, న్యూస్‌టుడే: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం పలువురు ప్రముఖులు శనివారం మంత్రాలయం వచ్చారు. కర్ణాటక మంత్రి శివరాజు తంగడి, ఆ రాష్ట్ర ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మునియప్పు, తెలంగాణ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ నిరంజన్ వేర్వేరుగా వచ్చి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. వారికి పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు శేషవస్త్రం అందించి ఆశీర్వదించారు.

శ్రీమఠంలో బళ్లారి జిల్లా అదనపు ఎస్పీ

మంత్రాలయం, న్యూస్‌టుడే: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం బళ్లారి జిల్లా అదనపు ఎస్పీ రవికుమార్ శనివారం మంత్రాలయం వచ్చారు. శ్రీమఠం చేరుకున్న ఆయనకు మఠం అధికారులు స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్రస్వామి మూల బృందావనం దర్శించుకున్నారు. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు శేష వస్త్రం అందించి ఆశీర్వదించారు.

రాఘవేంద్రస్వామి మఠానికి రూ.2 లక్షల విరాళం

మంత్రాలయం, న్యూస్‌టుడే: బెంగళూరుకు చెందిన రాఘవేంద్రస్వామి భక్తురాలు లలితమ్మ శ్రీమఠంలో అన్నదానానికి రూ. లక్ష, పుణెకు చెందిన రవి పట్వారి ఒకరోజు సంపూర్ణ సేవకు రూ. లక్ష విరాళంగా అందించినట్లు మేనేజర్ వెంకటేశ్ జోషి తెలిపారు. శనివారం వారు మఠానికి వచ్చి గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్రస్వామి మూల బృందావనం దర్శించుకుని విరాళాన్ని అందించినట్లు పేర్కొన్నారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి పల్లకోత్సవం

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కందనాతిలో చెన్నకేశవస్వామి ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా శనివారం పల్లకోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామిని ఆలయం నుంచి వెంకటగిరి, మాసుమాన్‌దొడ్డి మీదుగా ఆలయం వరకు ఊరేగించారు. స్వామి వారిని వివిధ పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థికి పాము కాటు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు మండలంలోని కడివెళ్లకు చెందిన శివ, పార్వతి కుమారుడైన ఉపేంద్ర నాలుగో తరగతి చదువుతున్నాడు. సెలవులు కావడంతో శనివారం గ్రామంలోని పొలానికి వెళ్లాడు. అక్కడ పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ఎస్‌ఎస్‌కే సంఘం సభ్యుల పూజలు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రామాలయంలోని అంబాభవానిదేవిని ఎస్‌ఎస్‌కే సంఘం సభ్యుల ఆధ్వర్యంలో శనివారం కూరగాయలతో ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎస్‌కే అధ్యక్ష, ఉపాధ్యక్షులు మిస్కిన్ రాంప్రసాద్, జీతూరి రవి, కార్యదర్శి జీతూరి నాగరాజు, సభ్యులు పి. వెంకటేశ్వర్లు, రమేశ్, వికాస్, మహేశ్ పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన నాయకులు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గూడూరు నగర పంచాయతీ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నాగరాజును వైకాపా నాయకులు, పురపాలక ఛైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, అస్లాం, అబేలు, లక్ష్మన్న, మదర్ సాబ్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

జాతీయ పోటీలకు ఎంపిక

సి.బెళగల్, న్యూస్‌టుడే: సి.బెళగల్‌లోని గురుకుల పాఠశాలకు చెందిన ఇంటర్ విద్యార్థి ఎం.ఉమేశ్ అండర్-19 విభాగంలో సెపక్‌తక్రాలో జాతీయ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ శనివారం తెలిపారు. ఈ నెల 1, 2 తేదీల్లో గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారన్నారు. జాతీయ పోటీలకు ఎంపిక కావడం ఇది రెండోసారని పీడీ పేర్కొన్నారు.

రాయితీ శనగ విత్తనాల పంపిణీ

సి.బెళగల్ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రాయితీ శనగ విత్తనాలు పంపిణీ చేస్తామని ఏవో మల్లేశ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. అవసరమైన రైతులు సేవా కేంద్రాలకు వెళ్లి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. క్వింటాలుకు రూ. 7,050, 20 కిలోల ప్యాకెట్‌కు రూ. 1,410 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

నాన్న చిత్రం.. ఓ రైతు కథ

కోసిగి, న్యూస్‌టుడే: యూట్యూబ్‌లో రాబోయే నాన్న చిత్రాన్ని ఆదరించాలని దర్శకుడు ఖాజా, నిర్మాత, నటులు కర్నూలు సుభాన్, కిశోర్ అన్నారు. శనివారం కోసిగిలోని బాలుర ఉన్నత పాఠశాలలో చిత్ర బృంద సభ్యులతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నాన్న సినిమా ఒక రైతుకు సంబంధించిన కథ అన్నారు. యూట్యూబ్‌లో ఈ నెల 8న చిత్రాన్ని విడుదల చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గోవిందు, బాషా, శీను, హనుమంతు, ప్రతాప్, సూరి, రజని పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: పెద్దకడబూరులో శనివారం ఆదోని మధు ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. లభించింది. 160 మంది రోగులకు మధుమేహం, రక్తపోటు, గుండె, కిడ్నీ సంబంధిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ సునీల్‌కుమార్ తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎముకల వైద్యుడు దేవనగౌడ, కార్డియాలజిస్ట్ విశ్వనాథ్, మండల వైద్యాధికారిణి ఫిరదౌసి పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలి

కోసిగి, న్యూస్‌టుడే: నూతన మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ భార్గవ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కోసిగి ఎక్సైజ్ కార్యాలయంలో మాట్లాడుతూ.. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చన్నారు. కోసిగి ఎక్సైజ్ పరిధిలో కోసిగి, పెద్దకడబూరు మండలాలకు 2 చొప్పున నాలుగు దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 9న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు చేసుకోవడానికి గడువు ఉందన్నారు.

పడేవరకు పట్టించుకోరా..?



గూడూరు నగర పంచాయతీలోని కొండిగేరిలో సుంకులమ్మ గుడి ఎదుటనున్న విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా మారింది. కింది భాగంలో కడ్డీలు తేలి తుప్పుపట్టింది. స్థానికులు సిమెంటుతో పూత వేయించినా ఊడిపోయింది. ఆలయానికి నిత్యం భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు, ప్రమాదం జరగకముందే స్తంభాన్ని మార్చాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

తవ్వారు.. తప్పుకొన్నారు



నిత్యం ప్రయాణికులు, వాహనాలతో రద్దీగా ఉండే మంత్రాలయం ప్రధాన రహదారిలో మధ్యలో మరమ్మతులు చేసి మట్టి, రాళ్లు అలాగే వదిలేయడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 15 రోజుల కిందట మరమ్మతులు చేసి బిలం వేయకుండా అలాగే వదిలేశారు. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. దసరా సెలవులు రావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో మంత్రాలయానికి తరలివస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మంత్రాలయం

వైకాపా హయాంలో రైతులకు రాయితీలు ఇవ్వలేదు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు రాయితీపై విత్తనాలు అందిస్తున్నారని, వైకాపా ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో ఏనాడు రాయితీలు ఇవ్వలేదని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం ఆయన మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులకు రాయితీ శనగ విత్తనాలు పంపిణీ చేసి మాట్లాడారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో రాయితీలుగాని, వ్యవసాయ పరికరాలుగాని ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సాలురెడ్డి, ఏవో రవిప్రకాశ్, తెదేపా నాయకులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

2,265 క్యూసెక్కుల నీటి విడుదల

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయం నుంచి 2,265 క్యూసెక్కుల నీటిని కేసీ కాల్వకు విడుదల చేస్తున్నట్లు జలాశయ ఇంజినీర్ రాజు పేర్కొన్నారు. ఎగువ నుంచి 2,280 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందన్నారు. శనివారం నాటికి జలాశయంలో 1.235 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: సర్దుబాటు పేరుతో విద్యుత్తు ఛార్జీలు పెంచి సామాన్యులపై భారం మోపుతున్నారని, తక్షణమే ఛార్జీలు తగ్గించాలని సీపీఐ నాయకుడు రంగన్న డిమాండు చేశారు. శనివారం పట్టణంలోని సోమప్ప కూడలిలో ధర్నా చేపట్టి మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లుగా విద్యుత్తు ఛార్జీలు పెంచి సామాన్యులకు మోయలేని భారం మోపిందన్నారు. కూటమి ప్రభుత్వం సైతం సర్దుబాటు పేరుతో భారీగా పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు దాదావలి, జబ్బార్, విరూపాక్షి, వీరేశ్, తిమ్మగురుడు, విజయేంద్ర, రామాంజనేయులు, ఖాజా, మల్లికార్జునగౌడ్, హనుమంతు పాల్గొన్నారు.



సోమప్ప కూడలిలో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

దళితుల అభివృద్ధికి కృషి చేద్దాం

కోసిగి, న్యూస్‌టుడే: అణిచివేతకు గురై నేటికీ ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న దళితుల అభివృద్ధికి కృషి చేద్దామని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏపీ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని కందుకూరు గ్రామంలో కేవీపీఎస్ జెండా ఆవిష్కరణ చేశారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తాయన్న, బెట్టనగౌడ్, అయ్యన్న, ముకురన్న, హనుమంతు, జోజప్ప, జయన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్‌బాబు

పార్టీలకతీతంగా పని చేయాలి

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: అధికారులు రాజకీయ పార్టీలకతీతంగా పని చేయాలని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి చాలా మంది అధికారులు గైర్హాజరు కావడంపై ఆరా తీశారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన అధికారులు ప్రతి గ్రామంలో సమస్యలు గుర్తించి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యుల సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజన నాణ్యతపై ఫిర్యాదులు వస్తున్నాయని ఎంపీపీ శ్రీవిద్య ఎంఈవో సువర్ణల దృష్టికి తీసుకెళ్లారు. కల్లుకుంట, దొడ్డిమేకల గ్రామాలకు ఎమ్మిగనూరు నుంచి బస్సులు నడపాలని సర్పంచులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయరాముడు, జడ్పీటీసీ సభ్యురాలు జాము రాజేశ్వరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలనాగిరెడ్డి

ఉల్లి క్వింటా గరిష్ఠ ధర రూ.3,969

కర్నూలు వ్యవసాయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ విపణికి శనివారం 11,150 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు రాగా క్వింటా కనిష్ఠ ధర రూ. 496, మధ్యస్థ ధర రూ.2,468, గరిష్ఠ ధర రూ. 3,969 పలికింది. 1,820 క్వింటాళ్ల వేరుశనగకాయల దిగుబడులు రాగా క్వింటా కనిష్ఠ ధర రూ. 2,789, మధ్యస్థ ధర రూ. 5,296, గరిష్ఠ ధర రూ. 6,866గా ఉంది. పూల విత్తనాలు గరిష్ఠ ధర రూ. 6,129, ఆముదాలు రూ. 5,976, శనగలు రూ. 6,113, ఎండుమిర్చి రూ. 8,501, కొర్రలు రూ. 2,909 వ్యాపారులు కొనుగోలు చేశారు.



ఎమ్మిగనూరు: గాయత్రీదేవి ఆలయంలో పారాయణం చేస్తున్న మహిళలు



ఎమ్మిగనూరు వ్యవసాయం: చేనేత మైదానంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో...



ఎమ్మిగనూరు వ్యవసాయం: వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో పాండురంగ స్వామి అలంకరణలో...

అన్నపూర్ణాదేవి.. అందుకోవమ్మా జేజేలు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం దేవీ మండపాలు, ఆలయాల్లో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. కొన్నిచోట్ల అమ్మవారు శాకంబరీగా దర్శనమిచ్చారు.
– న్యూస్‌టుడే బృందం



గోనెగండ్లలో పూజలు చేస్తున్న దుర్గాసేవా సమితి సభ్యులు



కోడుమూరు గ్రామీణం: కోడుమూరులో శాకంబరి దేవిగా అంబాభవాని



గూడూరు గ్రామీణం: కె. నాగలాపురంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



గూడూరు గ్రామీణం: గూడూరులోని వీరభద్ర స్వామి ఆలయంలో చౌడేశ్వరీదేవి



కౌతాళం: ఉప్పరహాల్‌లో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



మంత్రాలయం: వాసవీ కల్యాణ మండపంలో అన్నపూర్ణాదేవి అవతారంలో అమ్మవారికి హారతి ఇస్తున్న ఆర్యవైశ్య మహిళలు



మంత్రాలయం: రాఘవేంద్రపురంలో శాకంబరీ దేవిగా రేణుకా ఎల్లమ్మ

పల్లె ప్రగతి బాటలు

◆ సీసీ దారుల నిర్మాణానికి నిధుల కేటాయింపు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: వైకాపా ఐదేళ్ల పాలనలో పల్లెల ప్రగతికి పట్టిన పీడ వీడింది. గ్రామాల్లోని సమస్యలను వైకాపా ప్రభుత్వం పక్కనబెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో గ్రామీణాభివృద్ధికి 'బాటలు' వేస్తోంది. సీసీ రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని 51 గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇళ్ల ముందు, వీధుల్లోనూ ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకొని దారులు వేయనున్నారు. మురుగు సమస్య పరిష్కారానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కాల్వల ఏర్పాటుకు కాసులు మంజూరు చేసింది. నియోజకవర్గ వ్యాప్తంగా రూ. 6 కోట్లు విడుదల చేశారు. దీనికితోడు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 42.846 కోట్లు మంజూరయ్యాయి.

గోనెగండ్ల మండలంలో తిప్పనూరు-బోదేపాడు, గోనెగండ్ల-పెద్దమర్రివీడు గ్రామాల రహదారులు గుంతలమయంగా మారాయి. అలాగే రోడ్లకు ఇరువైపులా ముళ్ల పొదలు అలుముకున్నాయి. రాత్రివేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లకు మరమ్మతులతోపాటు వాటిని తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కులుమాలలో సీసీ దారుల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి (పాతచిత్రం)

గుర్తించిన పనులు చేపడతాం

– శంకర్, పంచాయతీరాజ్ ఏఈ, గోనెగండ్ల

గ్రామాల్లో సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. చేయాల్సిన పనులు గుర్తించాం. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే పనులు ప్రారంభించారు. మిగతా గ్రామాల్లో వీలైనంత త్వరగా చేపడతాం.

మండలం	పంచాయతీలు	15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు	ఉపాధి హామీ కింద విడుదలైన నిధులు
ఎమ్మిగనూరు	16	రూ.15,23,5003	రూ.2 కోట్లు
గోనెగండ్ల	20	రూ.150,20,342	రూ.2 కోట్లు
నందవరం	15	రూ.12,59,1360	రూ.2 కోట్లు

కర్నూలు

•కర్నూలు •పాణ్యం



సూచనలు ఇస్తున్న ఇన్‌ఛార్జి ఉప కులపతి ఎన్టీకే నాయక్

సమయం వృథా చేయొద్దు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఎలాంటి పరిస్థితిలో వృథా చేయొద్దని ఇన్‌ఛార్జి వీసీ ఎన్టీకే నాయక్ సూచించారు. ఆర్‌యూలోని ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు దసరా సెలవుల్లో ప్రాజెక్టులపై దృష్టి సారించాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సమాజంలో గుర్తింపు పొందేలా విద్యలో రాణించాలని ఆకాంక్షించారు.

డ్వామా ఇన్‌ఛార్జి పీడీగా మాధవీలత

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా డ్వామా ఇన్‌ఛార్జి పీడీగా మాధవీలత శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం అడిషనల్ పీడీగా పనిచేస్తున్న ఈమె ఇకనుంచి ఇన్‌ఛార్జి పీడీగా కొనసాగనున్నారు. ఇక్కడ పని చేసిన పీడీ అమర్‌నాథ్‌రెడ్డి రిలీవ్ కావడంతో ఆ స్థానంలో మాధవిలతను నియమించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ, **సమస్య:** కృష్ణానగర్ వీధుల్లో కాలువలు శుభ్రం చేయక వ్యర్థాలు పేరుకుపోయాయి. - **స్థానికులు**

సమస్య: నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో రహదారి గుంతలమయంగా మారాయి. - **సుధీర్, స్థానికుడు**

సమాధానం: సమస్యలు పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. - **నగరపాలక అధికారులు**

రాయితీ విత్తనాలు వినియోగించుకోవాలి



విత్తనాల సంచులను అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు న్యూస్‌టుడే: రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి రైతులను కోరారు. ఓర్వకల్లులో శనివారం ఏర్పాటు చేసిన రాయితీ పప్పుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. మండలానికి 265 క్వింటాళ్ల రాయితీ విత్తనాలు మంజూరైనట్లు వెల్లడించారు. ఏడీఏ సాలురెడ్డి, ఏవో సుధాకర్, తెదేపా వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు రాంభూపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అధికారులకు వార్డుల కేటాయింపు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : కర్నూలు నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో అధికారులకు వివిధ వార్డులు, పనులు కేటాయిస్తూ నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏఈలు, డీఈలు, ఈఈలకు వివిధ పనులను కేటాయించారు. ఈఈలు, డీఈల్లో కొందరికి సక్రమంగా కేటాయింపులు జరగలేదనే ఆరోపణలు వస్తున్నాయి.

ఆందోళనబాటలో మద్యం దుకాణ ఉద్యోగులు

కర్నూలు నేరవిభాగం : ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సేల్స్‌మెన్‌లు, సూపర్‌వైజర్లు మళ్లీ ఆందోళన చేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రత్నామ్నాయ ఉపాధి చూపాలని కోరుతూ వీరు ఆందోళన చేస్తున్న సంగతి విదితమే. సెప్టెంబర్ 30వ తేదీతో ఒప్పంద గడువు ముగిసినా అధికారులు నచ్చజెప్పటంతో పనిచేస్తున్నారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆదివారం మద్యం దుకాణాలు మూసేసి ఆందోళన చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

చిత్తగించి.. చెత్త పన్ను తొలగించి

✦ కూటమి ప్రభుత్వ నిర్ణయంపై హర్షం
✦ నగరవాసులకు తప్పిన భారం

నగరంలో గృహాలు	1.20 లక్షలకుపైగా..
దుకాణాలు : 30 వేలు	క్లాప్ వాహనాలు : 91
ప్రతి నెలా వసూలు లక్ష్యం :	రూ.1.26 కోట్లు
నగరవాసుల నుంచి చెత్త పన్ను రూపంలో వసూలు చేసింది	సుమారు రూ.10 కోట్లు

కర్నూలు నగర పరిధిలో 52 వార్డులు ఉన్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో 2022 ప్రాంతంలో చెత్త పన్ను వసూలు ప్రారంభమైంది. దీనిపై పలు ప్రాంతాల్లో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అయినా అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోగా బలవంతపు వసూళ్లకు పాల్పడ్డారు. నగరంలో మొదట్లో ప్రతి నెలా చెత్త పన్ను వసూలు లక్ష్యం రూ.1.26 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో 50 శాతానికిపైగా వసూలు చేశారు. నిరుపేదలు నివాసముండే ప్రాంతాల్లో రూ.60, మధ్యతరగతి.. ఆపైవారు నివాసం ఉండే ప్రదేశాల్లో రూ.120, వ్యాపారులకు రూ.100 నుంచి ఆపై చెత్త పన్ను విధించారు. దీంతో జనం ఆందోళన వ్యక్తం చేశారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరించింది. విద్యుత్తు, ఆర్టీసీ ఛార్జీలు భారీగా పెంచింది. ఇది చాలదన్నట్లు జనంపై చెత్త పన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. మరోవైపు తాము అధికారంలోకి వచ్చాక చెత్త పన్ను రద్దు చేస్తామని తెదేపా అధినేత చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో హామీనిచ్చారు. ప్రస్తుతం చెత్త పన్ను వసూలును పూర్తి స్థాయిలో రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఫలితంగా జనానికి ఊరట కలిగింది. చెత్త పన్ను భారం తప్పింది.

క్లాప్ వాహనాలు



తిరగబడిన జనం

చెత్త పన్ను విషయంలో జనం నుంచి తీవ్రమైన వ్యతిరేకత రావడంతో ఎన్నికల ముందు వైకాపా ప్రభుత్వం చెత్త పన్నును కాస్త తగ్గించింది. పేదలు నివాసముండే ప్రాంతాల్లో రూ.30, మధ్యతరగతి.. ఆపైవారు నివాసం ఉండే చోట రూ.60కు తగ్గిస్తూ నగరపాలక కౌన్సిల్‌లో తీర్మానించారు. నగరంలో ఇప్పటి వరకు ప్రజల నుంచి రూ.10 కోట్ల వరకు చెత్త పన్ను వసూలు చేశారు.

వ్యర్థాలు వేసి.. తాఖీదులిచ్చి

☛ కర్నూలు బీక్యాంపులో ఓ దుకాణదారు చెత్త పన్ను చెల్లించకపోవడంతో అతని దుకాణం వద్ద చెత్త వేయడంతోపాటు ట్రాక్టర్‌ను దుకాణానికి అడ్డంగా ఆపారు. ఇది అప్పట్లో పెద్ద సంచలనంగా మారింది.

☛ గాంధీనగర్‌లో దుకాణదారులు చెత్త పన్ను చెల్లించలేదంటూ తాళాలు వేశారు. సమయమిస్తే చెల్లిస్తామని వేడుకున్నా పట్టించుకోలేదు.

☛ బాలాజీనగర్‌లోని ఓ బహుళ అంతస్తులో నివాసముంటున్న వారికి చెత్త పన్ను కట్టాలంటూ తాఖీదులు జారీ చేశారు. చెల్లించకుంటే కుళాయి కనెక్షన్లు తొలగిస్తామని బెదిరించడంతో జనం భయపడి మొత్తం చెల్లించారు.

పన్ను నగదు పక్కదారి?

నగరంలో ప్రజల నుంచి వసూలు చేసిన చెత్త పన్ను డబ్బులు పక్కదారి పట్టించారన్న ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదట్లోనే చెత్త పన్ను వసూలు చేయడం ఆపేయాలని ఆదేశించింది. అయినా కొందరు ప్రజలు, వ్యాపారాల నుంచి చెత్త పన్ను వసూలు చేశారు. ఆ సొమ్మును నగరపాలక సంస్థ ఖజానాకు జమ చేయలేదన్న విమర్శలున్నాయి.

రహదారుల పనుల్లో వేగం అవసరం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: నేషనల్ హైవేకి సంబంధించిన రహదారుల పనులు వేగవంతంగా చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. ఆయన శనివారం తన క్యాంపు కార్యాలయంలో నేషనల్ హైవే అధికారులతో సమీక్షించారు. ఎన్‌హెచ్-40 భూసేకరణకు సంబంధించి నష్టపరిహారాన్ని వెంటనే పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్‌హెచ్-340సి రహదారి పనుల్లో భాగంగా వివిధ గ్రామాలకు సంబంధించిన క్లెయిమ్స్ త్వరగా పంపేలా చూడాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంత్రాలయం బైపాస్‌కు సంబంధించిన ప్రతిపాదనలు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్‌హెచ్-340సికి సంబంధించి బి.తాండ్రపాడు నుంచి గార్గేయపురం వరకు జరుగుతున్న ఔటర్ రింగ్‌రోడ్డు పనులను నవంబరు 15వ తేదీకి పూర్తి చేయాలన్నారు.

ఉల్లి క్వింటా గరిష్ఠ ధర రూ.3,969

కర్నూలు వ్యవసాయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ విపణికి శనివారం వివిధ పంట ఉత్పత్తులు వచ్చాయి. 11,150 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు రాగా క్వింటా కనిష్ఠ ధర రూ.496, మధ్యస్థ ధర రూ.2,468, గరిష్ఠ ధర రూ.3,969 పలికింది. 1,820 క్వింటాళ్ల వేరుశనగకాయల దిగుబడులు రాగా క్వింటా కనిష్ఠ ధర రూ.2,789, మధ్యస్థ ధర రూ.5,296, గరిష్ఠ ధర రూ.6,866గా ఉంది. పూల విత్తనాలు గరిష్ఠ ధర రూ.6,129, ఆముదాలు రూ.5,976, మొక్కజొన్న రూ.2,381, కందులు రూ.5,609, శనగలు రూ.6,113, ఎండుమిర్చి రూ.8,501, కొర్రలు రూ.2,909, మినుములు రూ.8,109, సోయాబీన్స్ రూ.4,241, సజ్జలు రూ.2,069కు వ్యాపారులు కొనుగోలు చేశారు.

పనులు నాసి.. రూ.కోట్లు మింగి



కలెక్టరేట్ భవన సముదాయానికి రూ.8 కోట్లతో మరమ్మతులు చేశారు. కాగా శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి పైకప్పు నుంచి వర్షం నీరు కారుతోంది. లీకేజీల కారణంగా కలెక్టరేట్ ఏవో కార్యాలయం వద్ద బకెట్లు అడ్డుపెట్టారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారుల పర్యవేక్షణలో చేపట్టిన పనులు నాసిరకంగా జరిగాయని పలువురు విమర్శిస్తున్నారు.
– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

భారీ వర్షం.. మునిగిన రైతు కష్టం



కర్నూలు గ్రామీణ మండల పరిధిలోని సుంకేసుల ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. ఫలితంగా వందలాది ఎకరాల్లో వర్షం నీరు నిలిచింది. పలువురు రైతులు పొగాకు సాగు చేశారు. భారీ వర్షం కారణంగా పెద్దఎత్తున నీరు నిలిచిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. – ఈనాడు, కర్నూలు

చినుకు.. నడవాలంటే వణుకు

☛ రహదారులను ముంచెత్తుతున్న మురుగు
☛ నగరవాసులకు తప్పని ఇబ్బందులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : చినుకు పడితే చాలు.. కర్నూలు నగరంలో పరిస్థితి అధ్వానంగా మారుతోంది. మురుగునీరు రహదారులను ముంచెత్తుతోంది. ఫలితంగా జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు అధ్వానంగా ఉండటం.. పూడికతీత పనులు సరిగా జరగకపోవడంతో మురుగు నీరు సాఫీగా ప్రవహించలేని పరిస్థితి. నిత్యం ఈ సమస్యలు వేధిస్తున్నా నగరపాలక అధికారులు దృష్టి సారించడం లేదు.

రూ.100 కోట్లు సమకూరుతున్నా..

నగర పాలక సంస్థకు ఏటా వివిధ పన్నుల రూపంలో రూ.100 కోట్ల వరకు సమకూరుతోంది. ఇదికాక వివిధ పద్దుల కింద నిధులు వస్తుంటాయి. ఈ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. నగరంలో 6 లక్షలకుపైగా జనాభా ఉంది. 1,100కుపైగా కాలనీలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో వసతులు కల్పించాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో సౌకర్యాలు లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రతి వారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై జనం వినతిపత్రాలు అందిస్తున్నా పరిష్కారం కానరావడం లేదు.

నిత్యం సమస్యే

ఈ చిత్రం గోశాల ప్రాంతంలోనిది.. అర్ధగంటపాటు వర్షం పడితే చాలు.. రహదారిపై మోకాలి లోతు నీరు నిలుస్తుంది. దీనికితోడు మురుగునీరు కలుస్తుండటంతో దుర్గంధంతో నిండిపోతోంది. ఈ మార్గంలో ప్రతిరోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. వర్షం పడిన ప్రతిసారి సమస్య ఉన్నా శాశ్వత పరిష్కారం కానరావడం లేదు. పాదచారులు మురుగులోనే నడవాల్సి వస్తోంది. బళ్లారి చౌరస్తాలోనూ ఇదే పరిస్థితి ఉంది. రహదారిపై అక్కడక్కడా గుంతలు ఉండటంతో పలువురు అదుపు తప్పి పడిపోతున్నారు.



సంక్షిప్త సమాచారం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: నగరంలోని ఆదిత్య విద్యా నిలయంలో కల్లూరు ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కె.బాషా ఆధ్వర్యంలో డా.శంకర్‌శర్మ చేతుల మీదుగా శనివారం 60 మంది మానసిక దివ్యాంగులకు ఒక్కొక్కరికీ రూ.1,500 చొప్పున పింఛన్లు పంపిణీ చేశారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలకు సంబంధించి మాజీ డైరెక్టర్ గోకారి నామపత్రం ఇచ్చారు. ఎన్నికల అధికారి దీనిని తిరస్కరించారు. గతంలో బేడ, బుడగ జంగం ఎస్సీ కింద డైరెక్టర్‌గా ఆయన ప్రస్తుతం నామపత్రం ఇవ్వగా.. బుడగ జంగం ఎస్సీ కిందకు రాదంటూ నామపత్రాన్ని తిరస్కరించారని బేడ, బుడగ జంగం రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్ ఆవేదన వ్యక్తం చేశారు.

కర్నూలు సచివాలయం : అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డులు ప్రదర్శించాలని డీఆర్వో చిరంజీవి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో అధికారులతో శనివారం సమీక్షించారు.

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: యువత సౌకర్యార్థం దాతలు పుస్తకాలు విరాళం ఇవ్వడం అభినందనీయమని గ్రంథాలయాధికారి గోవిందరెడ్డి అన్నారు. నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అబ్దుల్ రజాక్ కంప్యూటర్ సైన్సుకు సంబంధించిన పుస్తకాలను గ్రంథాలయానికి శనివారం విరాళంగా అందజేశారు.

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వైద్యశాలలో ఓపీ మానిటరింగ్ కమిటీని నియమిస్తూ ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.ప్రభాకరరెడ్డి శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. కమిటీలో ఆయనతోపాటు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.చిట్టినరసమ్మ, యూరాలజీ, సైక్రియాట్రిక్ విభాగాధిపతులు తదితరులు సభ్యులుగా ఉంటారు.

విద్యుదాఘాతంతో తమిళనాడు వాసి మృతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు పార్క్ రోడ్డులోని కర్ణాటక బ్యాంకులో శనివారం ఉదయం జనీష్ (28) అనే యువకుడు విద్యుదాఘాతంలో మృతి చెందారు. తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారి జిల్లా కవిల్‌వేలైకు చెందిన జనీష్ సీసీ కెమెరాలు ఏర్పాటుచేసే సంస్థలో పనిచేస్తుంటారు. దేశవ్యాప్తంగా కర్ణాటక బ్యాంకుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసే పనికి ఓ సంస్థకు అప్పగించారు. సదరు సంస్థలో పనిచేస్తున్న జనీష్ శనివారం ఉదయం స్థానిక కర్ణాటక బ్యాంకులో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసే పనికి వచ్చారు. బల్ల ఎక్కి తీగ లాగే క్రమంలో విద్యుదాఘాతంతో కిందపడిపోయారు. స్థానికులు వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



వీరేశ్‌ను సన్మానిస్తున్న భూపతిరావు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో 13వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు కర్నూలుకు చెందిన క్రీడాకారుడు బి.వీరేశ్ ఎంపికయ్యారు. అతడిని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు, న్యాయవాది శ్రీధర్‌రావు శనివారం కర్నూలులో సన్మానించారు. వీరేశ్‌కు బోయ సేవా సమితి సంస్థ తరఫున ఆర్థిక చేయూత అందించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు కృష్ణనాయుడు భరోసా ఇచ్చారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు

కర్నూలు నగరం : నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కళావాహిని సాంస్కృతిక సాహితీ సంస్థ ఆధ్వర్యంలో రంగస్థల నటుడు సుబ్బారావు సంస్మరణ సభను శనివారం నిర్వహించారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, మనోహర్ తదితరులు సుబ్బారావుకు నివాళులర్పించారు. గయోపాఖ్యానం యుద్ధ సన్నివేశం తదితరాలు ప్రదర్శించారు. కళాకారులను సత్కరించారు.

బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

క్రైం కార్నర్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు ఆర్టీసీ బస్టాండు వద్ద బస్సు ఢీకొనడంతో విజయరావు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సికింద్రాబాద్‌కు చెందిన ఇతను పూల వ్యాపారం చేస్తుంటారు. పని నిమిత్తం కర్నూలు వచ్చిన ఇతడిని బస్సు ఢీకొంది. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. కర్నూలు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11 మందిపై కేసుల నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలు ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి సి.క్యాంపు కూడలిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. నంద్యాల చెక్‌పోస్టు వైపు నుంచి వచ్చే వాహనచోదకులను తనిఖీ చేయగా 11 మంది మద్యం తాగినట్లు గుర్తించారు. 10 బైకులు, ఒక ఆటోను సీజ్ చేసిన పోలీసులు సదరు వాహనచోదకులపై కేసులు నమోదు చేశారు.

యువకుడి అదృశ్యం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలు నగరంలోని బిర్లాగడ్డకు చెందిన వీరేశ్ (19) అదృశ్యమయ్యారు. అతనికి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఈనెల 3వ తేదీ రాత్రి అందరూ నిద్రపోతున్న సమయంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయారు. అతని తండ్రి సుంకన్న కర్నూలు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిక్షణ పూర్తి చేయడం అభినందనీయం



వైద్యులకు పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపల్ డా.చిట్టినరసమ్మ

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: వైద్య విద్య బోధకులకు ప్రాథమిక వైద్య విద్య కోర్సులో శిక్షణ పూర్తి చేయడం అభినందనీయమని కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.చిట్టినరసమ్మ అన్నారు. వైద్య కళాశాలలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో ఎం.ఇ.యు. కోఆర్డినేటర్ శుభప్రద అధ్యక్షతన శనివారం నిర్వహించిన మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు.

31 మంది నామినేషన్ల దాఖలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలో గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ లిమిటెడ్ డైరెక్టర్ల ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ చేపట్టారు. కర్నూలు బహుళార్థ పశువైద్యశాల ఆవరణలోని జిల్లా సాంద్ర గొర్రెల విభాగం కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ కర్నూలు డివిజన్ ఉప సంచాలకులు డా.దుర్గా ప్రసన్నబాబు శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నామపత్రాలు స్వీకరించారు. మొత్తం 31 నామినేషన్లు వచ్చినట్లు ఆయన తెలిపారు. నామినేషన్ల పరిశీలన సోమవారం జరుగుతుందని, 8న నామపత్రాల ఉపసంహరణ అనంతరం తుది జాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు.

పథకాలపై అవగాహన అవసరం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: భవన నిర్మాణ రంగ కార్మికులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన పెంచుకోవాలని కార్మిక శాఖ ఉప కమిషనరు వెంకటేశ్వర్లు సూచించారు. దసరా నేపథ్యంలో స్థానిక రోజా వీధిలో సుమలత అధ్యక్షతన శనివారం పేద కార్మికులకు సరకులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బైలుప్పల షఫీఉల్లా, హనుమంతరావు, రాముడు, శేషమ్మ, ధరణి, విశ్వ తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు సరకులు అందజేస్తున్న కార్మిక శాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వర్లు

రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు ప్రారంభం

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: ప్రధాని మోదీ చొరవతో యోగాకు గుర్తింపు వచ్చిందని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, ఇండస్ పాఠశాలల అధినేత రాజశేఖర్ పేర్కొన్నారు. కర్నూలులోని ఇండస్ పాఠశాలలో రాష్ట్రస్థాయి యోగాసన ఛాంపియన్‌షిప్ పోటీలను ఆ సంఘం అధ్యక్షురాలు రాధిక, ఉపాధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, కోశాధికారి మల్లికార్జున తదితరులతో కలిసి శనివారం వారు ప్రారంభించారు.



జ్యోతి వెలిగించిన మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ తదితరులు

రెవెన్యూ విభాగంలో ఆర్‌ఐల నియామకం

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: కర్నూలు నగరపాలక రెవెన్యూ విభాగంలో గత కొన్నేళ్లుగా ఆర్‌ఐలు పాతుకుపోయారు. వారిని ఆ స్థానాల నుంచి వేరే స్థానాలకు బదిలీ చేయకుండా గత నగరపాలక ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వదిలేశారు. ఫలితంగా వారు ఏళ్ల తరబడి తిష్టేశారు. పలువురు ఆర్‌ఐలు ప్రైవేటు వ్యక్తుల ద్వారా అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు రావడంతో ప్రస్తుత కమిషనర్ రవీంద్రబాబు రెవెన్యూ విభాగంలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఏడుగురు ఆర్‌ఐలకు సీటు పని కల్పిస్తూ గత నెల 20న ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఐదుగురిని ఆర్‌ఐలుగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. జారీ చేశారు. మరోవైపు గతంలో పనిచేసిన ఇద్దరు ఆర్‌ఐలు ఎలాగైనా తిరిగి పాత స్థానాలకు వచ్చేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

జానపదం.. చైతన్యపథం

☛ నృత్య ప్రదర్శనలతో అవగాహన కార్యక్రమాలు ☛ విద్యార్థినుల విశేష కృషి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : యువతలోని నైపుణ్యాలు వెలుగులోకి తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. జిల్లా యువజన సంక్షేమ శాఖ (సెట్కూరు) ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా స్థాయి యువజనోత్సవంలో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు తమ కళా ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. ఇటీవల నగరంలోని సిల్వర్‌జూబ్లీ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో జిల్లా నుంచి పలువురు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు తమ ప్రతిభ చాటి అందరి మన్ననలు పొందారు.



జానపద గేయాలతో ప్రదర్శన

సామాజిక చైతన్యమే లక్ష్యంగా..



కర్నూలు డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంజలి బీకాం మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఆమె తల్లిదండ్రులు పద్మావతి, సోమన్న. తండ్రి అనారోగ్యంతో ఐదేళ్ల కిందట మృతి చెందారు. తల్లి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి స్వగ్రామం వెల్దుర్తి. పాఠశాల దశ నుంచే అంజలి నృత్య ప్రదర్శనలు ఇస్తున్నారు. యువజనోత్సవాల్లో భాగంగా తొలిసారిగా ఫోక్స్ డ్యాన్స్‌లో ప్రతిభ చాటారు. గ్రామాల పరిస్థితిని ప్రదర్శనల రూపంలో ఇచ్చారు. రాష్ట్ర స్థాయిలో సామాజిక చైతన్యం తీసుకొచ్చేలా నిరంతరం సాధన చేస్తున్నట్లు అంజలి చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతామని ఆమె పేర్కొన్నారు.

బృంద కళాకారిణిగా..



దిన్నెదేవరపాడులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మల్లిక ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఆమె తల్లిదండ్రులు సువర్ణ, సుంకన్న. వారు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరిది దిన్నెదేవరపాడు గ్రామం. మల్లికకు మొదటి నుంచి నృత్య పోటీలంటే మక్కువ. దీనిపై ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో బృంద కళాకారిణిగా ప్రతిభ చాటేందుకు యువజనోత్సవాలను వేదికగా చేసుకున్నారు. తన ప్రతిభతో ఆహుతులను అలరించారు. వివిధ అంశాలపై గ్రామీణ ప్రాంతాల ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు బృంద కళాకారులుగా ప్రదర్శన ఎంతగానో ఉపయోగపడుతుందని మల్లిక చెబుతున్నారు.

నవరాత్రి ఉత్సవం.. ఆధ్యాత్మిక వైభవం



గీతా మందిరంలో కన్యకాపరమేశ్వరికి వెంకటేశ్వరస్వామి అలంకరణ



పాతబస్తీలోని బండిమెట్ట గంగమ్మ ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణ



లలితాపీఠంలో వారాహి మాతగా దర్శనం

నగరంలోని పలు ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని శనివారం వివిధ రూపాల్లో అలంకరించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాలను విద్యుత్తు దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. పాతబస్తీలోని లలితాపీఠం, కాళికాంబ ఆలయం, గీతామందిరం తదితర ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో కుంకుమార్చన పూజలు జరిపారు. మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి మొక్కులు తీరుచుకున్నారు. కల్లూరులోని చౌడేశ్వరి దేవాలయంలో అమ్మవారిని పుష్పాండజ మహర్షి ఆశ్రమ పీఠాధిపతి, తొగటవీర క్షత్రియ కుల గురువు దివ్యజ్ఞానానందగిరి స్వామి దర్శించుకున్నారు.
- **న్యూస్‌టుడే, కర్నూలు ఆధ్యాత్మికం, బీక్యాంపు, కల్లూరు గ్రామీణ**



బుధవారపేట కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



నెహ్రూ నగర్‌లోని సత్యసాయి మందిరంలో కుంకుమార్చన పూజల్లో మహిళలు



36వ వార్డు వాసవీ నగర్‌లో అన్నపూర్ణాదేవి అలంకారంలో..



కల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో..